
...t Godavari District Adi Andhra Mahasabha
...Dharmanna was present
...ndhra Patrika, 26-05-1942

...hra Rashtra Hindu Seva Sanghamu" - working Committee
...mber.
...ndhra Patrika, 19, Nov - 1932

# హరిజనాభ్యుదయం



TL
Y563
35N47

బాలకృష్ణ



# హరిజనాభ్యుదయం.

Harijana Bhayyudayam

రచయిత :
Balakrishna
శ్రీ. పి. బాలకృష్ణగారు
(ప్రబోధ సాహిత్యసమితి)

S.NO: 871
ACC NO: 21,777

పబ్లిషర్సు :
రాతు బుక్ డిపో.,
ఎడ్యుకేషనల్ పబ్లిషర్సు,
రాజమండ్రి.

All Rights Reserved.

156860

వెల : 0—12—0

TL
Y563
25N47

అవంతీ ప్రెస్, రాజమండ్రి.

కాపీలు 2,0

# విజ్ఞప్తి! కృతజ్ఞత!

హరిజనాభ్యుదయ కాముకులైన పాఠకులకు—

భూత వర్తమాన సాంఘిక, రాజకీయ పరిస్థితుల్ని పర్యాలోకించి స్వజాతీయ భావి భాగ్యోదయాన్ని సూచించడం కర్తవ్యంగా భావించి - యీ చిన్ని గ్రంధాన్ని రచించాను. నేను ఆంధ్రరాష్ట్ర నిమ్నజాతీయ యువజన సంఘాధ్యక్షుణ్ణయిన సమయాన్ని, వివిధజిల్లాలు పర్యటనచేసి, సేకరించిన సమాచారం దృష్టిలోపెట్టుకుని, స్వజాతీయోద్ధరణ కొరకు ప్రణాళిక సిద్ధపర్చాను. గ్రంధవిస్తరణభీతి కారణంగా, గత హరిజనోద్యమ వృత్తాంతంలో ప్రముఖ సంఘసేవకుల్ని పేర్కొనలేక పోయాను. త్వరలో ద్వితీయభాగ మందాలోటు సవరించుకోగలనని వినమ్రతతో ప్రణమిల్లుతూన్నాను.

మనదేశంలో రాజకీయ పోరాటంతోపాటు సంఘ సంస్కరణకూడా సమవుజ్జీగా ఎట్లా సాగించబడిందో— భావిభారత నిర్మాతలైన యువజనులు, విద్యార్థులు గ్రహించి, స్వాతంత్రోద్యమంలో అస్పృశ్యతాపెనుభూతాన్ని అంతరింపజేయడానికీరచన తోడ్పడాలని నా ప్రధానోద్దేశం.

నే సూచించిన ప్రణాళికను రాష్ట్ర హరిజనోద్ధరణసంఘం పరిశీలించి, ప్రభుత్వ హరిజనాభ్యుదయ పంచవర్ష ప్రణాళికలో పొందుపరిస్తే — నా ప్రయత్నం కొంతవరకూ సఫలమౌతుంది. ఆ ఆశయంతో హరిజనోద్ధారక మంత్రిగారి కీరచన భక్తిపూర్వకంగా సమర్పించబడింది.

తరతరాలనుండీ దాస్యాంధకారంలో క్రుంగి, కృశించిపోతూన్న సోదర అస్పృశ్యులకీ రచన నేటి యాందోళనాయుగంలో- స్వాతంత్ర్య భారతావనిలో- నూత్నచైతన్యాన్ని కలుగజేయగలిగితే, నేను ధన్యుణ్ణి.

## కృతజ్ఞత.

ఈ గ్రంధరచనకు సదవకాశాన్ని కల్పించిన సుప్రసిద్ధ హరిజన నాయకులు శ్రీ సాకేటి గురుపులు, (ఎం. ఎల్. ఏ.) మిత్రులు శ్రీ విప్పర్తి సూర్యనారాయణరావు (పేపరు కంట్రోల్ ఇన్స్పెక్టర్) గార్లకు, ప్రమరణ

కర్తలైన శ్రీ 'రాతు' సోదరులకు; నా రచనలను ప్రోత్సహించి, నా నిత్య శ్రేయస్సుకోరు శ్రీ యం. వేంకటకృష్ణయ్య. (ఆంధ్రప్రభ విలేఖరి) శ్రీ ముత్తంగి జగ్గారావు. (బ్రహ్మసమాజ కార్యదర్శి రాజమండ్రి) శ్రీ కొమ్మాబత్తుల దుర్గాప్రసాదరావుగార్లకు; ఆదర్శ సంఘ సంస్కారులును, హరిజనోద్ధారకులు నైన శ్రీ కంభంపాటి రామశాస్త్రి (తూ. గో. జిల్లాబోర్డు విద్యాశాఖాధికారి) గారు గ్రంథానికి ఉపోద్ఘాతం వ్రాయడం నా అదృష్టం. వారికి ప్రత్యేకాభివందనాలు. ప్రూఫ్ దిద్ది, ముద్రించిన అవంతీ ప్రెస్ వారికి—

## స మ ర్పి త ం

అజ్ఞాన తిమిర మం దణగారుచుండిన
క్షుద్ర జాతులకు మేల్కొల్పుపాడి
బెజవాడ నగరాన పేదబిడ్డలజేర్చి
హరిజనోద్ధరణ కాదర్శ్యమొసగి
రైతు కూలీ ప్రజారాజ్యంబు వర్ధిల్ల
పల్లెటూళ్ళకు నవ్యపథముజూపి
ఖాదీ స్వయంపోషకత్వ సంసిద్ధికై
ఆంధ్రనాయకుల సమాదరించి

అమర గాంధీమహాత్ముని యడుగుజాడ
చెరుపుబడకుండ తమరు రక్షించుచుంట
అంకితమొసంగెద 'హరిజనాభ్యుదయము'
మాన్యచారిత్ర కూర్మయా మాత్యవర్య!

ది 15 ఆగష్టు 1947 సం॥ రం॥
స్వాతంత్ర్యదినోత్సవ సందర్భమున

## *Om !*

I have, with pleasure and profit, perused the pamphlet from the earnest hands of dear Balakristna. It is hardly necessary for me to say that the book contains, besides a rapid survey of the struggles and aspirations of the so called "Harijan" community, a number of interesting and useful suggestions for the emancipation of this oppressed and suppressed limb of Indian Society.

The essence of the "Harijan Problem" seems to my mind to lie in the early and full realization of the fact that it is more a chronic Socio-religion-econmic cancer, requiring an immediate operation, if society is to survive, than a mere political problem, baffling solution. The crying need of the hour is to keep wide open the hearts for the 'Harijans,' entry into our beings and close the doors of temples against those who do not open their hearts and hearths for these depressed fellow beings, for, in the immortal words of Brahmarshi Venkataratnam, "Forsake man the brother, God the Father is forsaken!". Details will work out themselves

if this essentially human factor operates in the name of the deity, dwelling in that capital of the Kingdom of God the human heart.

God guide us to face the problem squarely on the basis of religion, the only sure foundation of all solutions.

COCANADA }
10-8-47 }

THARAKAM

★

# విషయసూచిక.


అభ్యుదయం .... 1

అస్పృశ్యులెవరు ? .... 2

ఇది న్యాయమా ? .... 5

మతసంస్కరణం .... 6

సంఘసంస్కరణం .... 7

గాంధీజీ - హరిజనోద్యమం .... 10

రౌండుటేబిల్ కాన్ఫరెన్సు .... 11

హరిజనసేవాసంఘం .... 14

ఆంధ్రలో అస్పృశ్యతానిర్మూలనోద్యమం .... 16

బ్రహ్మ సమాజం .... 16

బ్రహ్మర్షి వేంకటరత్నం నాయుడుగారు .... 17

శ్రీ పిఠాపురం మహారాజావారు .... 21

ప్రముఖ హరిజనోద్ధారకులు .... 22

అస్పృశ్యుల దుస్థితి .... 24

ఆదిమాంధ్రోద్యమం .... 25

ఆంధ్ర హరిజన సేవాసంఘం .... 30

గత కాంగ్రెస్ మంత్రివర్గం .... 32

నిమ్నజాతుల ఫెడరేషన్ - ఆంధ్రశాఖ .... 33

ప్రబోధ సాహిత్యసమితి .... 37

| | | |
|---|---|---|
| నేటి ప్రజాప్రభుత్వం | .... | 38 |
| ప్రధాని ప్రకాశం - కోటిరూపాయలు | .... | 39 |
| మంత్రి కూర్మయ్యగారి హరిజన పౌరహక్కుల చట్టం | .... | 44 |
| డా॥ రాజన్‌గారి దేవాలయప్రవేశ చట్టం | .... | 46 |
| సమస్యా పరిష్కారం | .... | 47 |
| సామరస్య సంఘం | .... | 50 |
| కార్యప్రణాళిక | .... | 51 |
| అనుబంధం | .... | 67 |


# అభ్యుదయం.

చైతన్య స్వరూపుడైన పరమేశ్వరుని లీలాజగత్తులో ఈ ఇరవయ్యో శతాబ్దం ఒక అభ్యుదయ యుగం! నిశరాత్రి గర్భాన నెలపొడుపు- కారు మబ్బుల లోలోన జలధారలు- వేడి నిట్టూర్పులో ఉపశాంతి- ప్రాతలో క్రొత్తందనాలు. ప్రకృతిలక్షణాలు- డార్విన్ మహాశయుని పరిణామసిద్ధాంతం దిక్సూచిలా మానవుల్ని అభ్యుదయం వైపుకు దృష్టిని మరలింపజేస్తున్నది.

నేటి ప్రపంచం కల్లోలమై ఒక ప్రక్క- సంఘర్షణలతో- వర్గపోరాటాలతో- సంఘ సంస్కరణలతో- మరొకప్రక్క- శాస్త్ర పరిశోధనలతో- శాంతి సమావేశాల్తో- ఒక్కటి కాదు- అనేకం- ఒకచోట కాదు- విశ్వమంతా- విచిత్ర సంఘటనల్తో మార్పులు గోచరమౌతున్నవి. ఒక శతాబ్దంలో రావలసిన మార్పు ఒక్క రోజులో సంభవ మయ్యేందుకు వీలయింది. ప్రాచీన ధర్మ సిద్ధాంతాలు ఆర్థిక, సాంఘిక, రాజకీయాది విషయాల్లో తారుమారు అయ్యాయి. యజ్ఞ యాగాదులు- వర్ణాశ్రమ ధర్మాలు- తత్సంబంధమైన ఆచార వ్యవహారాలు అప్రస్తుతమై అనవసరమయ్యాయి. చరిత్రాత్మకంగా సమస్త రంగాల్లోనూ, ఎన్నో విప్లవాలు- ఎంతో పరిణామం తటస్థమయింది. ఆ నాటికీ- ఈ నాటికీ- ఎంత వ్యత్యాసం! ఎన్నియుగాలు రకరకాలుగా సాగిపోయాయి! నేటి 'అటం' అణుసూత్ర యుగంలో, 'అలక్ష్యం- అమృతం- విషం' అన్న ఉపదేశానుసారంగా గాఢకుషు ప్తివీడి మానవుడు నవ్య దృక్పథంతో, సమాజశక్తుల్ని కేంద్రీకరించుకుంటూ ముందుకు సాగిపో ప్రయత్నిస్తున్నాడు. ఏ దేశాని కా దేశం- ఏ వర్గానికావర్గం అభ్యు

దయ కాంతుల్ని దర్శించడానికి ఆయత్త పడుతూన్నది- జాగ్రత్త పడుతూన్నవి.

అందులో ఒకభాగమే హరిజనాభ్యుదయం-

ఏ స్వార్ధ విప్ర సంకల్పంవల్లనో- ఏ దురూహ్య కారణాంతరాలవల్లనో- మతంలో యేర్పడుపబడ్డ అస్పృశ్యతా దురాచారం వల్ల- మన దేశంలో ఈశ్వర పితృత్వం మానవ సౌభ్రాతృత్వం నశించిపోయింది. దాన్తో జనించిన ఘోరాంధకారం- దారిద్ర్య దుఃఖం ఉద్భృతమై సాంఘిక నరకాన్ని సృష్టించాయి. కర్మ సిద్ధాంతంతో నిమ్నజాతీయుల కండ్లుగట్టి విజ్ఞాన విహీనుల్ని చేసి, సవర్ణహిందువులు తమ మత నిరంకుశత్వాన్ని చెలాయించారు-

ఆ అజ్ఞాన ఘోరాంధకారం నుండి- ఆ క్రూర కఠోర నిరంకుశత్వంనుండి, శతాబ్దాలపాటు పీడితులైన అస్పృశ్యులకొక ఆశాకిరణం- అభ్యుదయ కాంతిరేఖ జనించింది. ఆ ప్రకృతి పరిణామానికి పరమేశ్వరుని చేతుల్లో పరికరాలై, మానవ శక్తు లెట్లా తోడ్పడ్డవో చరిత్రాత్మకంగా, సంక్షిప్తంగా పరీక్షించి చూద్దాం.

# అస్పృశ్యు లెవరు?

ప్రపంచ చరిత్రలో ప్రాచీన భారత దేశ చరిత్ర సువర్ణాక్షరాలతో శోభిల్లుతూంది. సంగీత- సాహిత్య వైజ్ఞానిక విషయాల్లో మానవ జాతికి భారతీయులే ఒరవడి పెట్టారని గర్వించుకోడానికి వేదాలు, పురాణాలు తార్కాణము లైనవి- విశ్వమానవ సౌభ్రాతృత్వం, సర్వాంగ సుందరమైన నాగరికత, రాజ్యాంగపరిజ్ఞానం,



ప్రజ్వరిల్లజేసి, సమస్త దేశాలకు ఆదర్శ ప్రాయమైన ప్రాచీన భారత దేశంలో- అస్పృశ్యత ఎట్లు జనించిందో నిర్వచించడం చరిత్రకారులకే కష్టసాధ్యం.

ఎందుచేత నంటే, "బ్రాహ్మణః క్షత్రియో వైశ్య స్త్రయో వర్ణా ద్విజాతాయః, చతుర్ధ ఏకజాతిస్తు శూద్రో నాస్తితుపంచమః" అని మనుస్మృతి స్పష్టంగా పంచమకులం లేదని తెలియజేస్తుంది. అదే విధంగా "చాతుర్వర్ణం మయా సృష్టం గుణకర్మ విభాగశః" అని భగవద్గీత- గుణ కర్మలచేత నాలుగే కులాలని వెల్లడిస్తూంది.

మనుస్మృతి- భగవద్గీత మొదలైన ప్రధాన ప్రమాణ గ్రంథాల్లో నిరూపించ బడని పంచమకులాన్ని ఎవరు- ఎందుకై సృష్టించారో అభ్యుదయ కాముకులంతా పరిశీలించవలసి వుంది.

— ఆర్యులు మన దేశం ఆక్రమించుకోవడంలో ఆది హైందవులతో తీవ్రమైన యుద్ధాలుచేసారు. పరాజితుల్ని బానిసల్ని చేసి తమ ఆధ్యాత్మిక, సాంఘిక సిద్ధాంతాలను అంగీకరించని వారిని బహిష్కరించారు.

ఆ బహిష్కృత భారతీయ వీరులే అస్పృశ్యులు- అని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు.

— బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలలో బ్రాహ్మణ స్త్రీకిని శూద్రునికిని జన్మించినవారు చండాలురన్న మనుస్మృతి ననుసరించి బ్రాహ్మణ స్త్రీ లొనర్చిన సాంఘికాపచారంవల్ల అస్పృశ్యతాజాతి సంక్రమించింది- అని సాంఘిక వాదులు విశ్వసిస్తున్నారు.

— గోభక్షణ, మద్యపానం నరహత్యాది దురభ్యాస దుష్కృతులవల్ల చాతుర్వర్ణాలనుండి వెలివేయబడ్డవారే అంటరానివారు. అని నైతిక శాస్త్రజ్ఞులు నమ్ముతూన్నారు.

— వర్ణాశ్రమ ధర్మాలను వదలి బ్రాహ్మణాధిక్యత. వేద దాస్యం నిరసించి స్వేచ్ఛావర్తనులైన వారిని హిందూసంఘం నుండి వెళ్ళగొట్టడంవల్ల యేర్పడ్డ జాతే అస్పృశ్యులు- అని తత్వజ్ఞులు భావిస్తున్నారు. ఎవరే అభిప్రాయం విశ్వసించినా ఆర్యుల రాజకీయ ఆధిక్యతకొఱకు, హైందవమత నిరంకుశత్వం కొరకు, అస్పృశ్యత భారతదేశంలో ప్రారంభమయింది. తత్ఫలితంగా అంటరానివారు ప్రత్యేక జాతిగా హైందవ సంఘంనుండి వేరుపడ్డారు. అట్టివారిలో విశ్వ విఖ్యాతిగాంచిన వశిష్ట, వాల్మీకి, పరాశర, వ్యాస, శుక, మహర్షులు- నంద, ప్రమగంధాది ప్రముఖ ధర్మపాలకులు- హనుమంత, వాలి, సుగ్రీవ, కన్నమనీడు, కుయపుడు, మొదలాది వీర సైన్యాధిపతులు- చోకామేళ, తిరుప్పణ్వారు, నందనార వంటి భక్తవరేణ్యులు- అరుంధతి, శబరి, మాతంగి, సత్యవతి మొదలైన మహిళామణులు చిరస్మరణీయులు. ఆ మహామహులైన స్త్రీపురుషుల సంతతి వారే నేటికినీ అస్పృశ్యులై ఆర్థిక, ఆధ్యాత్మిక సాంఘిక, రాజకీయ జన్మహక్కుల్ని కోల్పోయి హైందవ సంఘానికి దాసాన దాసులై, అధఃపతితులై పోయారు.

వీరు ధనికవర్గ దాస్యాంధకారంలో- హైందవమత నిరంకుశత్వంలో జీవించలేక దేశంలో మారుమూలలకు పరారులై పోయి ఎనభై ఆరు జాతులువారుగా చీలిపోయారు. సంఘంలో అతి నీచాతి నీచమైన వృత్తులకు వీరు తలలొగ్గి, నేడు తిన తిండి కట్టబట్ట, ఉండ యిల్లూ, లేకుండా అత్యంత దీన దశలో కృంగి కృశిస్తున్నారు. వీరే అస్పృశ్యులు. పాడి పంటల అభివృద్ధికీ పట్టణ పారిశుద్ధ్యానికీ, పాదరక్షల నిర్మాణానికీ, ప్రభుసేవాదీక్షకూ పేరొందిన స్వార్థరహితులా అస్పృశ్యులు ?



## ఇది న్యాయమా ?

ఒక పతిత సంఘాన్ని బహిష్కరించి దానిపై మరొక హైందవ సంఘం అధికారం చెలాయించడం పురాతన భారత దేశంలో స్వార్థపరులకు న్యాయసమ్మతంగా తోచింది. కొన్ని శతాబ్దాలపాటు నిరాటంకంగా, దౌర్జన్య పూరితంగా అస్పృశ్యుల్ని పీడించారు. అందుచేత ఇందలి న్యాయాన్యాయాలు తీర్పు చెప్పి దేశ గౌరవాన్ని నిల్పవలసిన బాధ్యత ప్రతీ మేధావంతుని పైనా వుంది.

పీడించేవారు పీడించబడేవారు-ధనికుడు పేద—అనే అసమానత్వాలతో సంఘ ముండకూడదనే పాశ్చాత్య సామ్యవాద సిద్ధాంతాలతో అస్పృశ్యత అన్యాయమని తీర్పు చెప్పడంలేదు. ఎందుచేతనంటే మానవుడు పరిపూర్ణుడు కాడు. చరిత్రలో మానవుడనేక పొరపాట్లు చేశాడు. ఆ పొరపాట్లలో అస్పృశ్యతను పాటించడం, భారతీయులు చేసిన మహా తప్పిదాల్లో ఒకటని శాస్త్రకారులు రుజువుచేశారు. ఒక ప్రక్క "తత్వమసి, సర్వం ఖల్విదం, బ్రహ్మ, సర్వవ్యాపీ, సర్వభూతాంతరాత్మ"- సర్వ భూతములయందు భగవంతుడున్నాడని వేదాలు ఘోషిస్తున్నవి. కనుక తోడి మానవుణ్ణి అస్పృశ్యుణ్ణిగా, తూలనాడి హింసిస్తే అది భగవంతుణ్ణి తూలనాడినట్టు కాదా !

"సర్వేజనా స్సుఖినోభవంతు" అను విశ్వజనీనమైన ఉపనిషద్వాక్యం మానవహృదయ కవాటాలనుతట్టి ప్రేమోపదేశంతో ప్రతిధ్వనిస్తుంటే, తోడి మానవుణ్ణి అధమాధముణ్ణిగా నిరసించి పీడిస్తే అది ధర్మసమ్మత మౌతుందా ?

"తస్మిన్ప్రీతి స్తస్యప్రియకార్యసాధనంచ తదుపాసనమేవ" ఈశ్వరుని యెడల ప్రీతి, ఆయనకు ప్రియమైన కార్యాలు సాధించ

డమే ప్రార్థనయని ఋషీశ్వరులు ఉద్ఘోషించారు. ఆ ఋషుల సాంప్రదాయాలకు చెందిన సంఘాలలో, తోడివారిని చెండాలురని, అగౌరవించి యిక్కట్లకు పాల్చేయడం ఆస్తికులైన హైందవులకు ధర్మయుక్తమా? ఇవి పొరపాట్లుకావా! ఇక సంయుక్త నియోజక వర్గ సూత్రాలపైనా, సామ్యవాదసిద్ధాంతాలపైనా ప్రజాతంత్రం మహావేగంతో స్వాతంత్ర్యం వైపు పురోగమిస్తూ వుంటే— ఇంకా ఒకమతంపై మరొకమతం ఒకకులం మీద మరొక కులం అధికారం— నిరంకుశత్వం చలాయించుకోవడం భారతీయులకు భావ్యమేనా ? న్యాయమేనా ?

## మత సంస్కరణం.

అస్పృశ్యత పాటించడం అన్యాయమనీ, ఇది భారతీయ నాగరికతకు పెద్ద కళంకమని, సర్వ భూతాంతరాత్ముడైన పరమేశ్వరుని దృష్టిలో పాపమనీ మన హైందవ మత ప్రవక్తలు నవ భారతయుగ సంధిలో గుర్తించ గలిగారు- శ్రీరామానుజాచార్యులు శంకరాచార్యులు, బుద్ధ, దయానంద, నానక్కు, రామమోహన రాయలు, రామకృష్ణ పరమహంస, వివేకానంద, వీరేశలింగం పంతులు, మొదలయిన ప్రముఖులు ప్రాచీన మత ధర్మాలను కాలానుగుణ్యంగా మార్పు చేశారు. వివిధ మత సహనాన్ని కోరారు. వేదాంత సారాన్ని క్రోడీకరించి, కుల నిర్మూలనోద్యమానికి పునాదులు వేశారు. కాని "సమయశ్చాపి సాధూనాం ప్రమాణం వేదవద్భవేత్" (సాధుపుంగవుల వచనాలు వేద ప్రమాణముల వంటివి.) అను పురాణసూక్తుల్ని గ్రహించువారేరీ? మహా సంస్కర్తల ప్రవచనాలు బూడిద బోసిన పన్నీరు వలె నిరర్థకములైనవి. కారణం హిందూమతంలో యుగయుగాల క్రిందట



నాటుకుపోయిన అస్పృశ్యతా విషబీజం పెకలించడానికి శక్యం కాకుండా శాఖోప శాఖల్తో మహా వృక్షమైపోయింది. దానికి సామ్రాజ్యవాదులు- మత నిరంకుశత్వ వాదులు- బూర్జువావర్గం, అభ్యుదయ నిరోధకపు ముఠా, పేళ్లెపాతానికి పాతుకపోయారు. ఇక వృక్షంపై మతంపేరిట జనించిన దురాచారాలన్నీ భూతపిశాచాలై విహరింపబూనాయి. వీటి రాక్షస కృత్యాలతో మిళితమై హైందవమతం అర్థశూన్యమయింది, నేటి హైందవ మతానికొక నిర్వచనం లేకుండా పోయింది. అస్పృశ్యతా కారణంవల్ల హిందూ మతమొక నరకకూపంగా పరిణమించింది. మానవ కళ్యాణాన్ని కోరవలసినమతం మానవకల్లోలాన్ని రేకెత్తించింది. దేవునికిని మానవునికిని మధ్య సన్నిహిత సంబంధం పెంపొందించవలసిన మతం ఒండొరుల మధ్య విద్వేష కుడ్యాలు నిర్మించింది. కనుక ఎంత సత్వరంగా మత సంస్కరణ చేస్తే అంత వేగంగా దేశాభ్యుదయం కలుగుతుంది. ఏనాడువిశ్వకవి రవీంద్రుడు కీర్తించిన మహోత్కృష్ట మత ధర్మాలను శాంతిదూత మహాత్మా గాంధి ఆచరిస్తున్న ప్రసిద్ధ ధర్మ సిద్ధాంతాలును, భారత తత్త్వవేత్త సర్ సర్వేపల్లి రాధాకృష్ణ వచిస్తున్న ధర్మ ప్రసంగాలను సమ్మేళవించి హైందవమతం పునరుద్ధరించ బడుతుందో నాడే- బహిష్కృత భారతికి విముక్తి! భావిభారతికి జాగృతి!

## సంఘ సంస్కరణం

విభజించి పాలించడానికి ప్రసిద్ధికెక్కిన సామ్రాజ్యవాదులు ఆంగ్లేయులు, అస్పృశ్యుల ఉద్ధరణకు సాహసించలేనందువల్ల క్రైస్తవమిషనరీల ప్రాబల్యంతో అస్పృశ్యుల సంఘోద్ధరణ ప్రారంభమయ్యింది. ఇంతలో జాతీయోద్యమం ప్రబలింది. దాదా

బాయినౌరోజీ ఆధ్వర్యాన్ని 1886 సం॥రం కలకత్తాలో జరిగిన మహాసభలో సంఘసంస్కరణం, కాంగ్రెస్ కార్యక్రమంలో ప్రధానమైన విషయమని వెల్లడించబడింది. 1887 లో దివాన్ బహదూర్ ఆర్. రఘునాధరావు, గోవిందపల్లభరెనడే, నరేంద్రనాథ్‌సేన్, జానికనాద్‌ఘోషాల్ మొదలైన ధీశాలురంతా కలసి 'ఇండియన్ నేషనల్ సోషల్‌కాన్ఫరెన్సు' అను ప్రత్యేక సంస్థను నిర్మించి, రాజా సర్. టి. మాధవరావు కె సి. యస్. ఐ. గారి అధ్యక్షతను మద్రాసులో ప్రధమమహాసభ జరిపి, రాష్ట్రాలవారిగా సంఘసంస్కరణోద్యమాన్ని విస్తరింపజేయడానికి వివిధకార్యక్రమాలను పరిశీలించడానికి పెక్కుఉపసంఘాలను నెలకొల్పారు. సంఘదురాగతాల నెన్నింటినో పరిష్కరించారు. అందు నిమ్నజాత్యుద్ధరణొకటి. ఆవెనుక 1917 వ సం॥రం కలకత్తా కాంగ్రెస్ మహాసభలో ఏనిబిసెంటు సతి (అధ్యక్షురాలు) అస్పృశ్యతా నిర్మూలనంపై గంభీరోపన్యాసం గావించింది. శ్రీ జి. ఎ. నటేశన్ గారు ప్రతిపాదించిన నిమ్నజాతీయోద్ధారణా తీర్మానాన్ని బలపరుస్తూ బులాభాయిదేశాయి, రామాయ్యర్, అసఫాలీ మొదలైన రాజకీయవేత్త లానాడు అస్పృశ్యతా నిర్మూలనానికి నడుములు బిగించారు—అదే సంవత్సరం బొంబాయిలో 'బహిష్కృత భారతసమాజ సభ్యులు సర్. నారాయణచంద్రవర్కార్ అధ్యక్షతను సమావేశమై స్వజాతి జన్మహక్కుల్ని రక్షించి, నిమ్నజాత్యుద్ధరణకు కంకణం కట్టవలసిందని ఆంగ్లప్రభుత్వాన్ని కోరుతూ కొన్ని తీర్మానాలు చేసారు. కడు విచిత్రంగా ఆయేడాదిలోనే బ్రాహ్మణేతరపార్టీ, బొంబాయిలో సమావేశమై నిమ్నజాతులకు నిర్బంధోచితవిద్య ప్రసాదించి వారి ఉద్ధరణకు ప్రత్యేకశ్రద్ధ



వహించవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుతూ పెక్కు తీర్మానాలు చేసారు—చిన్నచిన్న నీటిబిందువులతో మహాసముద్రం తయారైనట్టు సభావేదికలపై గావించిన చిన్నచిన్న తీర్మానాల ఫలితంగా దేశంలో ఒక దివ్య ప్రబోధం కలిగింది. అస్పృశ్యతా నివారణోద్యమం సాంఘికంగా దినదినాభివృద్ధి నొందింది. ఆ వుద్యమానికి గాంధీజీ యంగ్ యిండియా అపారమైన సేవ చేసింది. 1921 వ సం॥రం పత్రికలో "అంటరానితనమనే నేరం చేసినందుకు మనం న్యాయమైన శిక్షను అనుభవించుతున్నాం, పాపానికి తగిన ప్రాయశ్చిత్తం మనకు జరుగుతూంది. నిమ్నజాతుల యెడ మనం 'డయ్యర్' వలె నిరంకుశత్వంగా ప్రవర్తించడం లేదా? మనం వారిని చండాలురని పిలుస్తూ వెలివెట్టి దూరం చేశాం. బ్రిటీషు వలస రాజ్యాలలో భారతీయుల్ని బహిష్కరించి నీచంగా చూస్తున్నారు.

బావులలో చెరువులలో అస్పృశ్యులను నీళ్ళు తోడుకోనివ్వము. వారి నీడ తగిలితేనే మైలపడతామా అన్నట్లు ప్రవర్తిస్తున్నాం. ఏ అక్రమాలకై ఆంగ్లేయుల్ని మనం ఆక్షేపించుతామో అవన్నీ అస్పృశ్యులు మనపై ఆరోపించవచ్చు. అందుచేత అంటరాని తనమనే నేరాన్ని అనుసరిస్తున్నంత కాలం భారతప్రజలకు స్వరాజ్యాన్ని పొందగోరే నైతికహక్కు లేదు." అని మహాత్ముడు మహోజ్వలంగా లిఖించాడు. ఐతే కొందరు కాంగ్రెసు పెద్దలు సంఘ సంస్కరణోద్యమాన్ని కాంగ్రెసు సభా వేదికలపై మిళితం చేయకూడదని వాదోపవాదాల్లో పడ్డారు. దానికర్థం మన నాయకులు సాంఘిక విప్లవానికి అడ్డుకున్నారని చెప్పవచ్చు. ఆ సందర్భంలో కాంగ్రెసును విమర్శించ నవుసరం లేదు. దానికి సమాధానంగా చైనా భాగ్య విధాత సన్‌యట్‌సేన్ సుభాషితం స్వీక

రించవలసియుంది. "రాజకీయ మార్పులతోపాటు సాంఘిక మార్పులుకూడ రాకపోతే జన సామాన్యానికి సంపూర్ణ సంతోష సౌఖ్యాలు చేకూరవు. యే కొద్దిమంది పెట్టుబడిదార్లో అనుభవిస్తారా సంతోష సౌఖ్యాలు. కార్మిక కర్షకుల కష్టాలు తొలగక పోవడంచేత వారిలో అసంతృప్తి ప్రబలుతుంది. ఒకజాతిలో విప్లవం తీసుకరావడం. ఒకప్రభుత్వంలో మార్పు తీసుకురావడం చాలా సులువైన విషయాలు; కాని సంఘంలో విప్లవం తీసుకురావడం కష్టమైన పని. సాంఘిక విప్లవం జయప్రదంగాకొనసాగించాలంటే ప్రజ్ఞావంతులైన ప్రముఖులు సంఘంలోబయలు దేరాలి" అనే వాక్కుల్లో గంభీరమైన భావం గర్భితమై వుంది.

నాటి కాంగ్రెసులో ప్రజ్ఞావంతులైన రాజకీయవేత్త లున్నప్పటికినీ హైందవసంఘ మూఢ ధర్మాలకు దాసులై వారు సంఘ సంస్కరణోద్యమాన్ని సంఘ విప్లవ నిరోధకంగా మార్చడంవల్ల మహోజ్వలమైన తీర్మానాలు, నిర్జీవములైనవన్న ఆశ్చర్యపడ నవుసరం లేదు. అవి చరిత్రాత్మక సంఘటనలుగా భావించి, భావి సంస్కర్తలు తమ పురోగమనాన్ని సరిదిద్దుకోవలసి వుందికదా?

## గాంధీజీ— హరిజనోద్యమం

1920 సం॥రం నుండీ కాంగ్రెసు మహాసంస్థ గాంధీజీ నాయకత్వాన స్వరాజ్య కార్యక్రమాన్ని నడిపించింది. ఒక ప్రక్క సహాయ నిరాకరణోద్యమాన్ని మరొక ప్రక్క అస్పృశ్యతా నివారణోద్యమాన్ని దేశీయ రాజకీయాలలో మేళవించి గాంధీజీ తీవ్రమైన ప్రచారం చేసాడు. లక్షలకొద్దీ యువకులు అస్పృశ్యులకు జరుగుతూన్న అన్యాయాలను గుర్తించి వాటి నిర్మూలనానికి నడుములు బిగించారు. ఆ రోజుల్లో ఖిలాఫత్ సమస్య అస్పృశ్యతా నివారణ, గాంధీజీ జీవితాన్ని కడు కలవర పెట్టడంవల్ల వాటి పరిష్కారం కొరకై అహోరాత్రాలు కృషి చేసాడు. తత్ఫలితంగా 1922 లో బార్డోలీ కాంగ్రెసు మహాసభ నిమ్నజాత్యుద్ధరణకై బ్రహ్మాండమైన కార్యక్రమం తలపెట్టి స్వామీ శ్రద్ధానంద, శ్రీమతి సరోజినీ నాయుడు, ఐ. కె. యజనిక, జి. బి. దేశపాండే గార్లతో ఒక ఉపసంఘం నిర్ణయించారు. దేశాభ్యుదయానికై సేకరించిన 1 కోటి 25 లక్షల స్వరాజ్య నిధినుండి, నిమ్నజాత్యుద్ధరణకై 2 లక్షల రూపాయలు ప్రత్యేకించబడ్డాయి. ఇదొక చరిత్రాత్మకమైన విషయం. నిమ్మజాత్యుద్ధరణకు కొంత ప్రత్యేక ధనం కేటాయించడం వల్ల గాంధీజీ తలపెట్టిన అస్పృశ్యతా నివారణోద్యమం మరింత కార్యసిద్ధి పొందింది. కాని స్వామి శ్రద్ధానందవంటి మహోత్తమ నిమ్నజాతీయ సేవకుడు కాంగ్రెసు కార్యక్రమం నుండి రాజీనామా పెట్టి "బార్డోలీ హరిజనోద్ధరణా తీర్మానంలో లోన లొటారం బైట శృంగారం తప్ప ఏమీ లేదు." అని వెల్లడించగా నాటి కాంగ్రెసు నాయకులంతా ఆత్మపరీక్ష చేసుకుని, దరిద్రనారాయణ సేవ చేయడానికి కార్యోత్సాహులయ్యారు.

## రౌండు టేబిల్ కాన్ఫరెన్సు

1930లో భారత రాజ్యాంగ నిర్మాణం కొరకు "ది యిండియన్ రౌండు టేబిల్ కాన్ఫరెన్సు" యేర్పరచి డాక్టర్ అంబేద్కరు, దివాన్ బహదూర్ ఆర్. శ్రీనివాసన్ గార్లను నిమ్నజాతీయ ప్రతినిధుల్నిగా వారిని ప్రభుత్వం ఇంగ్లాండు కాహ్వానించింది. అల్ప సంఖ్యాకుల రక్షణ నిమిత్తమై డాక్టర్ అంబేద్కరు తయారుచేసిన నివేదిక అజ్ఞానాంధకారంలో మైమరచి నిద్రించు పీడిత జాతీయులకొక ఉషఃకీర్తన వినిపించింది. అందులో ముఖ్యంగా, సమాన పౌరసత్వం—సమానోచితపు హక్కులు,

రక్షణావిధానం, శాసనసభల్లో ప్రాతినిధ్యం, పీడితులపై ప్రయోగించు దురహంకార నిర్మూలనం ప్రత్యేక ప్రభుత్వ శాఖానిర్వహణం—నిమ్నజాతులు: రాజ్యాంగం అనే శీర్షికల్లో హిందూ దేశపు రాజకీయాలలో గుట్టు బైటపడేటట్టున్నూ, అఖిలభారత కాంగ్రెస్ నిమ్నజాతులకు ప్రాతినిధ్యం వహించడం లేదనిన్నీ ఉద్ఘోషించాడు.

ఆ మరుసటి రౌండు టేబిల్ కాన్ఫరెన్సులో భారత ప్రతినిధిగా మహాత్మా గాంధీ దేశంలోని మైనారిటీల, రక్షణా విధానంపై—ప్రసంగించగా డాక్టర్ అంబేద్కర్ తీవ్రంగా విమర్శించాడు. మహాత్మా గాంధీకీ డాక్టర్ అంబేద్కరుకూ మధ్య మహాసభలో జరిగిన వాగ్వాదం, భారతీయుల్ని కల్లోల పరిచింది. "గాంధీ నిమ్నజాతుల ప్రతినిధి కాడు. దేశంలో అస్పృశ్యుల ప్రతినిధి యెవరో ప్రజాభిప్రాయాన్ని బట్టి నిర్ణయించుకోవచ్చు. అని అంబేద్కర్ సవాలు చేసాడు. ఆ పిదప లేబరుపార్టీ ప్రధాని రామ్సే మెక్డొనాల్డు, అంబేద్కర్ కోరినట్టు ప్రభుత్వ శాసనసభల్లో నిమ్నజాతులకు ప్రత్యేక నియోజకవర్గ సూత్రాన్ని అంగీకరించినట్లు ప్రకటించాడు. ఐతే దాన్ని గాంధీజీ అంగీకరించలేదు. దానికి కారణం మహాత్ము డీవిధంగా వివరించాడు. "నిమ్న జాతులకు ప్రత్యేక నియోజకవర్గం యేర్పాటు చేస్తే సుమారు ఏడుకోట్లమంది హిందూమతం నుండి వేరు చేయబడతారు. అపుడు హిందూసంఘం బలహీనమౌతుంది గనుక అస్పృశ్యుల్ని విడదీసి ప్రత్యేక నియోజకవర్గం అమలు జరిపితే నేను మరణించేవరకూ ఉపవాసవ్రతం చేస్తాను." ఈప్రకటన దేశస్థుల్ని ఆందోళనా పూరితుల్ని చేసింది. ఆ కఠోరమైన ఉపవాసం సవర్ణ హిందువులనూ, అస్పృశ్యులనూ ఐక్య పరచి ఒండొరుల మధ్య



సుహృద్భావం పెంపొందించడానికే ఉద్దేశించబడినట్టు ప్రజానీకం గ్రహించింది. గాంధీజీ ప్రాణ రక్షణ హిందూ అస్పృశ్యుల ఐక్యతపై ఆధారపడినట్టు స్పష్టమై యదార్థమైన అస్పృశ్యతా నివారణోద్యమాన్ని కాంగ్రెస్ లేవదీసింది. "నిమ్నజాతుల కష్టాల్ని తొలగించడానికి నేను తిరిగి వచ్చే జన్మలో అస్పృశ్యుడిగా జన్మిస్తాను" అని ఏనాడు మహాత్ముడు ప్రకటించాడో నాడే బహిష్కృత భారత దేశానికొక సువార్త వినిపించింది. ఆ వార్తా ప్రచారం గ్రామ గ్రామాల్లో ప్రతీ భారతీయుని హృదయంలో సాంఘిక చైతన్యాన్ని కలుగచేసింది.

ఎట్టకేలకు కమ్యూనల్ అవార్డులో మార్పుకు ప్రభుత్వం అంగీకరించింది. తత్ఫలితంగా పూనా ఒడంబడిక 1932 సెప్టెంబరు 24 వ తేదీన జరిగింది. దానివల్ల హైందవ నాయకులకూ నిమ్నజాతీయ నాయకులకూ మధ్య సామరస్యం ఏర్పడినట్టు కనిపించింది. మొత్తం దేశంలో 148 శాసన సభాస్థానాలు ప్రత్యేకించబడ్డాయి. (మద్రాసు 30, బొంబాయి 15, పంజాబ్ 8, బీహారు ఒరిస్సాలు 18, మధ్యపరగణాలు 20, అస్సాం 7, బెంగాలు 30; సంయుక్తపరగణాలు 20) వాటన్నింటికీ సంయుక్త నియోజక వర్గ సూత్రంమీద నిమ్నజాతీయ ప్రతినిధులు ఎన్నుకోబడతారు.

ఈ విధానం అంగీకరించబడిన వెంటనే దేశ రాజకీయ రంగంలో నూత్న వికాసం ప్రజ్వరిల్లింది. ముఖ్యంగా అస్పృశ్యులకు రాజకీయ హోదాలు ప్రత్యేకించబడడంవల్ల, సాంఘిక రంగంలో గౌరవ ప్రతిష్ఠలు సమకూడకగాలియి.

ఈ ఒప్పందం తటస్థించిన మరుసటి రోజునుండీ నిమ్న జాతులకు పెక్కు దేవాలయాలు తెరువబడ్డాయి. అస్పృశ్యులకు

హిందూ పాఠశాలల్లోనికి ప్రవేశం యివ్వబడింది. పెక్కు నూతులలో నీరు తీసుకోవడానికి అస్పృశ్యుల కవకాశ మిచ్చారు.

మహాత్మా గాంధీ "హరిజన్" అనే వారపత్రిక స్థాపించి హరిజనాభ్యుదయానికి ఉజ్వలమైన పెక్కు వ్యాసాలు వ్రాస్తూ దేశీయుల్ని అస్పృశ్యతా నిర్మూలనానికై ప్రబోధించడం ప్రారంభించాడు.

## హరిజన సేవాసంఘం.

1932 సెప్టెంబరు 30 వ నాడు బొంబాయిలో పండిత మదన మోహన మాలవ్యాగారి అధ్యక్షతను బ్రహ్మాండమైన మహాసభ జరుపబడింది. ఆనాడే "ఆలిండియా యాంటీ అన్‌టచ్‌బిలిటీ లీగ్" సంస్థాపించబడింది. దానికి శ్రీజీ. డి. బిర్లాగారు అధ్యక్షులుగాను శ్రీ తక్కరుబాబా ప్రధాన కార్యదర్శిగాను వుండేందుకు నిర్ణయమయింది. "అస్పృశ్యతా వ్యతిరేకసమితి" అనే పేరు గాంధిగారికి సమ్మతం కానందువల్ల పై సంఘానికి "హరిజన సేవక సంఘం" అనే క్రొత్తపేరు పేర్కొనబడింది. దానితో అస్పృశ్యులకు 'హరిజను' లను నామకరణం చరిత్రాత్మకమయింది. పేరు మార్పువల్ల అస్పృశ్యత నిర్మూలనం కాలేదన్న విషయం యదార్థమైనప్పటికినీ "అంటరానివారు" అనే కర్ణ కఠోరమైన పేరుకన్న "హరిజనులు" అనుపేరు కొంత యింపుగా ఆధ్యాత్మికంగా వుందనే వాదనలో సత్యం లేకపోలేదు. భాషను బట్టి భావం: భావాన్నిబట్టి భాష ఉత్పన్న మౌతూండడంవల్ల 'హరి'శబ్దం వైష్ణవులకేగాని శైవులకు యింపైనపదం కాకపోవడముతో 'హరిజన పదం' ఆందోళనాపూరితమయింది. ఏవెట్లున్నా దేశంలో అస్పృశ్యులుగా పరిగణించబడే 86 జాతులవారు దేవుని కిష్టమైనవారయ్యారు. హరిజన సేవాసంఘంద్వారా అస్పృశ్యుల్లో ఆర్థిక, సాంఘిక, విద్యాభివృద్ధులు జరిపించడానికి ఢిల్లీలో ఒక కేంద్రసంఘం యేర్పడింది. అది దేశంలోని హరిజన సేవకులకొక ఆశాజ్యోతియై వెలసింది. ప్రతి రాష్ట్రంలోను జిల్లావారీగా సంఘాలు నెలకొల్పితద్వారా హరిజన వసతిగృహాలు వృత్తివిద్యా పాఠశాలలు మంచినీటి సదుపాయాలు కల్పించి అసమానమైన సేవ చేయడానికి కార్యప్రణాళిక తయారు చేశారు. సంవత్సరానికి 6 లక్షల రూపాయిలు చొప్పున 5 సం॥ల పాటు విధి విరామం లేకుండా హరిజనాభ్యుదయానికి ధనం వెచ్చించ సంకల్పించారు. సంఘ నిధికై మహాత్ముడు జోలె చేబట్టి యావద్భారత దేశం సంచారం చేశాడు. 1933 నవంబరు 7 వ తేదీ, హరిజనాభ్యుదయ చరిత్రలో సుప్రసిద్ధమై సువర్ణాక్షరాలతో వర్ణించడానికి కారణం. హరిజన నిధికై వయోవృద్ధుడైన మహాత్ముడు పాదచారియై సంచారము ప్రారంభించగా, వేలాదివేల ప్రజలు అస్పృశ్యతను నిర్మూలించి, గాంధీజీకి ప్రియమైన అనుచరు లయ్యారు. 8 లక్షల రూపాయల నిధి సమకూర్చి మహాత్ముడు హరిజనసేవా సంఘాభివృద్ధికి తోడ్పడ్డాడు. అంతకంటె హరిజన సేవా సంఘమనే మొలక మహాత్ముని తపోజలంతో, పెంచబడి ఫలవృక్షమయిందన్న కథ సమంజసంగా వుంటుంది. డాక్టర్ అంబేద్కర్ "ది యిండియన్ సోషల్ రిఫార్మర్" పత్రికా సంపాదకుడు మొదలైన ప్రముఖ మేధావంతుల సూచనలు స్వీకరించి, హరిజన సేవాసంఘం నేటివరకూ హరిజనాభ్యుదయ కార్యక్రమాన్ని నిర్వహిస్తూనే వుంది. కాని తత్సంఘాల్లో నిమ్నజాతులకు సరియైనప్రాతినిధ్యం లేకుండా చేసి, సంఘం తలపెట్టిన యే కార్యక్రమాన్ని దిగ్విజయంగా కొన

సాగించలేకపోయిందనే అపవాదుకు సరియైన సమాధానం లేనందుకు శోచనీయం।

## ఆంధ్రలో అస్పృశ్యతా నిర్మూలనోద్యమం.

అస్పృశ్యత, హైందవ మతంలో ఒక ప్రధాన ధర్మంగా పరిణామం చెంది, ఆసేతు హిమాచల పర్యంతం వ్యాపితమయింది. అనాదిలో ఆంధ్ర సామ్రాజ్య పాలకులైన ఆదిమాంధ్రులపై ఆర్య సంతతి దండెత్తి వారిని పదచ్యుతుల్ని చేసి, దాస్య సంకెళ్ళతో బిగించి, బహిష్కరించారు. ఘోరాతి ఘోరమైన సంఘ బహిష్కరణవల్ల, కనీసపు పౌరసత్వపు హక్కులనే గోల్పోయి దారిద్ర్య దుఃఖాంబుధిలో మునిగి నేటికింకా గిజగిజా కొట్టుకుంటూన్నారు. సనాతన హైందవ మతాంధకారం నుండి బయటపడడానికి ధనికవావ తరంగాల విపత్తునుండి తొలగడానికీ ఆంధ్రాస్పృశ్యులు చేసిన ప్రయత్నాలకన్నా వారి నా క్లిష్టసాగరాన్నుండి దరి జేర్చడానికి ఎందరో ప్రముఖులు నౌకలయ్యారు. నావికులై నాయకులై జీవితాలను సైతం త్యాగం చేశారు. అట్టి మహాసేవకు లెందరో పరమపదించినా సజీవులైనా గ్రంధ విస్తరణా భీతిచే పేరుపేరునా వారిని పేర్కొన జాలనందుకు చింతిల్లుచున్నాను.

## బ్రాహ్మసమాజం.

సంఘసంస్కర్తగా విశ్వ విఖ్యాతి గాంచిన కందుకూరి వీరేశలింగం పంతులుగారు, వారికి కుడిభుజమై పనిచేసిన చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారు, రాజమహేంద్రవరంలో రామమోహన పాఠశాల నెలకొల్పి పెక్కు ఆదిమాంధ్ర విద్యార్థులకు భోజనవసతి విద్యా సౌకర్యాలు కల్పించారు. కొలది సంవత్సరాలకు ఆంధ్ర బ్రాహ్మ మండలివారు అస్పృశ్యతా నిర్మూలనోద్యమాన్ని తమ ప్రధాన కర్తవ్యంగాభావించారు. కాకినాడ పట్టణంలో ఒక విద్యార్థి వసతి గృహం సమాజ యాజమాన్యాన నడిపించి 1915 సం॥ర ప్రాంతంలో సుమారు 50మంది ఆదిమాంధ్ర విద్యార్థులకు తిండి, బట్ట, విద్య లొసగి వారికి ధర్మజిజ్ఞాస నేర్పించే మహోత్కృష్ట కార్యానికి పూనుకున్నారు. బ్రాహ్మ సమాజకులు ఆంధ్రలో అస్పృశ్యతా నిర్మూలనోద్యమానికి పునాది వేసినవారు కాకపోయినా అస్పృశ్యుల్లో వైజ్ఞానిక చైతన్యం కలిగించడానికి వారు చేసిన కృషి ప్రశంసనీయమైనది.



## బ్రహ్మర్షి వేంకటరత్నం నాయుడు గారు.

వీరు పతిత జాత్యుద్ధరణకై త్రికరణశుద్ధిగా కృషి చేశారు. వీరు కరుణా నిధియై అస్పృశ్యుల్ని ఆదరించి రక్షించేవారు. వీరు 1-2-1921 వ సం॥లో జరిగిన తూ. గో. జిల్లా ఆదిమాంధ్ర మహాసభకు అధ్యక్షత వహించి యీ విధంగా ఉపన్యసించారు. "దేశంలో మహా పరిణామం తటస్థించింది. ప్రభుత్వం మీ అభ్యుదయాన్ని గూర్చి ఆలోచిస్తుంది. సవర్ణులుకూడా మీసేవాఋణాన్ని గుర్తించుకున్నారు. ఇక మీజన్మ హక్కుల్ని మీరు కోరి ఆందోళనచేసి సంపాదించండి—మీ సంఘాభ్యుదయానికి నేను తెలియపరచే ప్రణాళికలో మొట్టమొదటిది విద్యాప్రచారం. రెండవది నిమ్నజాతుల సఖ్యత." అని ప్రబోధించారు.

21—3—1923 లో మదరాసు లెజిస్లేటివు కౌన్సిలులో నిమ్నజాత్యుద్ధరణ విషయమై గావించిన ఉపన్యాసం నేటికింకా ప్రతీ హరిజనసేవకుని హృదయంలోనూ ప్రతి ధ్వనిస్తూనే వుంటుంది. ఆనాటి సభలో వారు నుడివిన కొన్ని వాక్యా

లివి. "ఈ దేశంలో కుల దారిద్ర్యానికి మించిన ఘోర దారిద్ర్యం మరొకటి వుందా ? ఆ కుల దారిద్ర్య కారణంగానే కదా నిమ్నజాతులని పిలవబడేవారు అధఃపతితు లైపోయారు ! వారా హీనస్థితిలో వుండడానికి బాధ్యు లెవరు. వారి ఉద్ధరణకు మనం యేంచేయవలసి వుంది ? నైతికంగాను జాతీయంగాను కూడా మనం వారికి ఋణపడి వున్నాం. అదెట్లా చెల్లించుకుని మనం ఋణ విముక్తుల మవాలి ? అన్నదే నేటి ప్రధాన సమస్య ! ప్రభుత్వంలో ఏదోఒక శాఖద్వారా వారికి సహాయం చేయడం కాకుండా ప్రభుత్వాధికారం గల ప్రతీశాఖా సమయోచితంగా, అభిమాన పూర్వకంగా, నిమ్నజాత్యుద్ధరణ తమ కర్తవ్యంగా భావించి తోడ్పడాలని నా వినతి. మద్రాసు రాష్ట్రంలో 65 లక్షలు అంటే మొత్తం జనాభాలో 5 వంతుగల నిమ్నజాతుల నుద్ధరించే బాధ్యత ప్రభుత్వానిది కాక మరెవరిది ? మనం గమనించ గలిగితే వారి ఆరోగ్య వసతుల దుస్థితి మన హృదయాలను కంపింపచేస్తుంది. వీరి ఉద్ధరణా సమస్య మనం స్వరాజ్యాన్ని పొందడానికి హక్కు-దారులమో కాదో పరీక్షిస్తుంది. దేశంలో దురాచారాలు నిర్మూలించడం, వంశ పారంపర్యంగా గుత్తగొన్న అధికారాలు తొలగించడం, సాంఘిక అసమానత్వాన్ని రూపుమాపడం మొదలైన కార్యాలవల్ల తరతరాలనుండి పీడితులైన నిమ్నజాతులవారికి ప్రత్యేకించి ఏం ప్రయోజనం కలుగుతుంది ? వాటితోపాటు నిమ్నజాతీయుల్ని ఉన్నతోద్యోగాల్లో ప్రవేశపెట్టాలి. నా మనస్సులో వున్న అభిప్రాయాన్ని సవినయంగా తమకు మనవి చేసేది ఏమిటంటే నిమ్న జాత్యుద్ధరణకు ప్రభుత్వం ఒక ప్రత్యేక డిపార్టుమెంటు నెలకొల్పి అందు నిమ్నజాతీయ విద్యావంతుల్నే అధికారుల్నిగా నియమించాలి. దానికికారణం రక్తబాంధవ్యానికి మించిన అభిమానం



మరొకటి లేకపోవడమే. "నా ధనము, నా మనము, నా తనము సమస్తమూ నిమ్నజాతుల ఉద్ధరణకై అంకితం చేస్తాను" అని వచ్చే స్వచ్ఛంద సేవకు లెందరో వున్నారు. అట్టి వారందర్ని ప్రోత్సహించి వెంటనే ప్రభుత్వం ఒక డిపార్టుమెంటును నెలకొల్ప వలసిందని ప్రార్థన. ఈ సమస్యా పరిష్కారం కొరకు మనలో వుండే బ్రాహ్మణ బ్రాహ్మణేతర విభేదాలు మరచిపోదాం. ఒక అడుగు ముందుకు వేసి, నిమ్నజాతుల పురోభివృద్ధికి తోడ్పడుదాం.

ఈ సందర్భంలో సిద్ధార్థుని జీవితంలో తటస్థమైన ఒకసంఘటన స్ఫురణకు వస్తుంది. "ఒకసంధ్యాసమయాన్ని, పర్వతప్రాంతాన్నున్న ఒక ఆశ్రమాన్ని దర్శించడానికి సిద్ధార్థుడు పయనమయ్యాడు. త్రోవలో ఒక పెద్ద గొఱ్ఱెలమంద కానవచ్చింది. అందులో ఒక విషాదదృశ్యం ఏమిటంటే రెండు గొఱ్ఱె పిల్లలు సిద్ధార్థుని హృదయాన్ని ఆకర్షించాయి. అందొక పిల్ల ఆరోగ్యంగా బలంగా వుంది. అది చెంగుచెంగున గెంతుతూ, మందలో చేరుకుంటూ ముందుకు పోతూంది. మరొకటి కుంటిది. బలహీనంగా వుంది. వెనక్కి దిగబడిపోయి మందకు కనుచూపు దూరంలో విషాదంగా అరుస్తూవుంది. అపుడు పాపం ! తల్లి గొఱ్ఱె దాని హృదయాన్ని బిడ్డలగురించి రెండు విభాగాలు చేసింది. మొదట పరుగులిడుతూ ముందుకు పోతూన్న పిల్ల ఎక్కడికి పోతుందో అని తానూ పరుగెత్తింది. కాని వెనువెంటనే వెనుకబడిపోయిన కుంటిదానికొరకు ఆతురతతో ఆవేదనతో పరుగెత్తి వెనుకకు వచ్చి ఆదరించింది. ఈ సంఘటన కండ్లారా చూచి దయార్ద్ర హృదయుడైన బుద్ధుడు కుంటి గొఱ్ఱెపిల్లని ఎత్తుకొని తల్లిగొఱ్ఱెతో "అమ్మా ! నీ హృదయం బిడ్డల నిమిత్తమై రెండు విభాగా

లయింది. వెనుక బడ్డ యీ కుంటిబిడ్డను నేను ఎత్తుకుని, బాధా నివారణ గావించి, మందలో చేరుస్తాను. నీవేమీ కలతపడకు. నీ హృదయం శాంతిల్లుగాక" అని వచించాడు. ఈ కథ ననుసరించి తమకు నివేదించేదేమంటే ఇపుడు భారతమాత హృదయం అభివృద్ధి పొందినవారికొరకూ వెనుకబడిన జాతుల కొరకూ, రెండు విభాగాలయింది. కనుక సిద్ధార్థుని ఆదర్శంగా పెట్టుకుని వెనుకబడిన నిమ్న జాతుల అభ్యుదయానికి సిద్ధసంకల్పులు కండని విజ్ఞప్తి చేస్తున్నాను. నాడే భారతమాత హృదయానికి శాంతి లభిస్తుంది" అని ఆంగ్ల భాషలో అత్యద్భుతంగా అమృతవర్షం వర్షించినట్టుగా ఉపన్యసిస్తే మద్రాసు కౌన్సిలర్సు హృదయాలు కరగి కరుణతో చెమ్మగిలినట్లు అనేకసార్లు పెద్దలు కథలుగా చెపుతూ వుంటారు. వీరొనర్చి మహాదాతృత్వ కార్యాలెన్నో వున్నా వాటిని పేర్కొనకుండా ఒక గంభీరోజ్వలమైన ఉపన్యాసాన్ని పాఠకులకు సమర్పించడంలో ప్రధానోద్దేశం ఏమంటే ఆ మహాశయుడు వాంఛించిన వాంఛ 1946నాటికిగాని సఫలీకృతం కాలేదు. నిమ్మజాత్యుద్ధరణకు ప్రత్యేక ప్రభుత్వ శాఖ "హరిజన అప్లిఫ్టు డిపార్టుమెంటు" నెలకొల్పి మద్రాసురాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంగౌరవపాత్రమయింది. కాని ప్రధాని ప్రకాశంగారు ఆ హరిజనాభ్యుదయ శాఖకు గౌరవనీయులైన శ్రీ వేముల కూర్మయ్యగారిని మంత్రిగా నియమించి ఆ డిపార్టుమెంటు నిర్వహించడానికి నెలకు కొన్నివందల రూ॥లు జీతం మీద ఒక బ్రాహ్మణ వకీలును డైరెక్టరుగా వేయడానికి ఉద్దేశించారు. ఈ విధానం కీర్తిశేషులైన బ్రహ్మర్షి వేంకటరత్నం నాయుడుగారి ఆత్మనెంతో గాయపరచి వుంటుంది. ముఖ్యంగా నాయుడుగారు శ్రీ పీఠికా పురాధీశునికి గురువరేణ్యులై. మహాద్భుత కార్యాలు చేయించి చిరస్మరణీయులయ్యారు. ఆంధ్ర హరిజనోద్ధారకుల్లో అగ్రస్థానం వీరికే లభించాలి. ఎందుచేతనంటే అస్పృశ్యతా నిర్మూలనానికివారు పాతికేళ్ళ క్రిందట తలపెట్టిన వర్ణాంతర వివాహ కార్యక్రమాన్ని నేటికింకా దేశంలో ఏనాయకులూ ఆదరించి ఆచరించ లేకపోతున్నారు. వీరు నవ్యాంధ్ర హరిజనులకు పితామహులు. వీరి అడుగుజాడల ననుసరించి యేనాడు ఆంధ్రనాయకులు హరిజనోద్ధరణకు పూనుకుంటారో నాడే అస్పృశ్యత పూర్తిగా నిర్మూలనమౌతుంది.



## శ్రీ పిఠాపురం మహారాజావారు.

నిమ్న జాతుల సేవ ఏదో లాంఛనప్రాయంగానో లేక ఒక రాజకీయ నాగరికతా లక్షణంగానో కాకుండా "దీన జన సేవ నా కర్తవ్యం" అనే మహోత్కృష్ట భావంతో 1920 వ సం॥రం నుండి నిమ్నజాత్యుద్ధరణకు దీక్షాకంకణం ధరించారు. 1922 వ సం॥రాన్ని పిఠాపురంలో "శాంతికుటీర" మనే పేరున హరిజన బాలురకొక వసతిగృహం బాలికలకొక ప్రత్యేక వసతి గృహం నిర్మించి పిఠాపురం హైస్కూల్లో ఉచితవిద్య ప్రసాదించారు. కాకినాడ కళాశాలలో హరిజన విద్యార్థులకు ఉచిత విద్యతోపాటు ప్రతీ విద్యార్థికీ సాలుకు 200 రూపాయలు విద్యార్థివేతనం కలుగజేసేవారు. కనుకనే 100 కి 99 మంది ఆంధ్ర హరిజన పట్టభద్రులు శ్రీవారి ఆదరణాభిమానాల్ని పొందినవారై యున్నారు. 1932 సం॥రం లో గాంధీజీ హరిజన నిధికి 5 వేల రూపాయీల భూరివిరాళం అనుగ్రహించారు. 1933 లో ఆంధ్ర హరిజన మహా సభకు మహారాజావారే అధ్యక్షత వహించారు. ఇపుడువీరు "ఆంధ్రా షెడ్యూల్డు కేష్టుస్వెల్‌ఫేరు అసోసియేషన్" అనే ఒక ఉత్తమ సంస్థకు గౌరవాధ్యక్షులుగా ఉంటున్నారు. వీరు తూర్పు గోదావరి జిల్లా ఆది

మాంధ్ర సంఘానికి సంవత్సరానికి 200 రూపాయలు చందా యిస్తారు. కాకినాడలో సుప్రసిద్ధమైన "అనాధ శరణాలయం" నెలకొల్పి సుమారు 30 సం॥ రాల నుండి దిగ్విజయంగా సాకుతున్నారు. ఆంధ్ర హరిజనసేవా సంఘాధ్యక్షులు శ్రీ బి. యస్. మూర్తిగారు నవజీవన పత్రికలో రాసినట్లు "ఆంధ్ర హరిజనలోకం శ్రీ మహారాజావారికి ఋణపడిపోయింది. మహారాజావారిని హరిజన సంఘం పితృభక్తితో సేవిస్తుంది."

## ప్రముఖ హరిజనోద్ధారకులు.

కీ. శే. శ్రీ తలారి గోపాలరావు నాయుడుగారు:—వీరు మాల కలెక్టరని ప్రసిద్ధిగాంచారు. అందుకు ముఖ్యకారణం, వారి ఉద్యోగ కాలంలో హరిజనోద్ధరణమే ప్రధానకర్తవ్యంగా భావించి, ఎన్నో మహత్తరమైన ఘనకార్యాలు సాధించారు. నిమ్నజాతులకు బంజరు భూములు సేద్యాని కిప్పించి, ఎందరో నిరుద్యోగ హరిజన యువకులకు గౌరవప్రదమైన ఉద్యోగాలు కలగచేశారు. నిమ్నజాతుల విద్యాభివృద్ధికి ఎంతో ధనం వ్యక్తిగతంగా వెచ్చించారు. ఒక హరిజన యువకుణ్ణి తన గృహంలో పెట్టి పెంచి విద్యాబుద్ధుల్లో ప్రవీణుణ్ణి చేశారు. సహపంక్తి భోజనాది సంస్కరణోద్యమాన్ని ప్రోత్సహించారు.

హరిజనాభ్యుదయం పవిత్రాశయంతో వారు దాని సాఫల్యానికై అహోరాత్రాలు కృషి చేసి 25 మే 42 నాడు పరమపదించారు. వారి స్మారక చిహ్నంగా రాజమండ్రిలో పారిశ్రామిక ప్రదర్శనశాలకు చేర్చి ఒక భవనం నిర్మించబడింది. అందులో హరిజన పారిశ్రామిక విద్యాలయం ఒకటి నెలకొల్పబడింది. ప్రతి వత్సరం వారి స్మారక సభల సందర్భాల్లో హరిజన నాయకులకు, పారిశ్రామికవేత్తలకు, కవులకు, గాయకులకు, సన్మానాలు జరుగుతూంటవి. అందువల్ల నాయుడుగారి స్మారకదినం హరిజనాభ్యుదయవేత్తలకొక ప్రధాన చరిత్రాత్మక దినంగాపరిణమిల్లింది.



నాయుడుగారు స్వర్గీయులైనా, వారు తలపెట్టిన హరిజనాభ్యుదయ కార్యక్రమం నిర్విఘ్నంగా నెరవేర్చేందుకు శ్రీమతి చంద్రమతి దేవిగారు, శ్రీ వెన్నేటి సత్యనారాయణగారు బద్ధకంకణులై నేటికింకా తీవ్రమైన కృషి చేస్తున్నారు. వీరికికూడా హరిజనలోకం ఎంతో ఋణపడి వుంది.

2. శ్రీ గూడూరి రామచంద్ర రావు గారు:—వీరు ఆంధ్ర హరిజనోద్యమ నిర్మాతల్లో ప్రధానులు. త్రికరణ శుద్ధిగా అస్పృశ్యతా నిర్మూలనానికి హరిజనాభ్యుదయానికి సర్వశక్తుల్ని వినియోగించిన ఉత్తమ హరిజన సేవకులు. హిందూసంఘ దౌర్జన్యాలకు గురియైనా నమ్మిన ఉత్తమ ధర్మ నిర్వహణకై దీక్షబూనిన కర్మయోగి. పాతికేళ్ళక్రిందట పతితజనోద్ధరణకై పెక్కు విద్యాసంస్థల్ని స్థాపించి వారి విజ్ఞానాభివృద్ధికై ఆరాటపడిన మహాత్యాగి. అహింస (నిమ్నజాత్యభ్యుదయము) అను పత్రికా నిర్వాహకులై వజ్రపు తునకల్లాంటి సంపాదకీయాలు వ్రాసేవారు. ఒకసారి అస్పృశ్యతా నిర్మూలనంగూర్చి లిఖిస్తూ "అస్పృశ్యతా పెనుభూతం వేయితలల శిఖండి. దీనిని దునుమాడగల మహానుభావుడు. ఎపుడు అవతరించునో" అని సాంఘిక సత్యాని చక్కగా చిత్రించగలిగారు. వీరి సేవాశ్రమం. గుడివాడ నిమ్నజాతీయులకొక మాతృగృహంలా నేటికింకా వర్ధిల్లుతూంది. వీరికి కూడా హరిజన లోకం ఎంతో ఋణపడి వుంది.

3. శ్రీ వేమూరి రాంజీరావు గారు:— వీరి హరిజన సేవాదీక్ష అమోఘమైనది. విద్యాప్రచారం ఒక్కటే అస్పృశ్యతా నిర్మూలనానికి రాజబాట యని విశ్వసించి, బందరులో నిమ్మజాతీయ విద్యార్థులకి ఒకవసతి గృహం నిర్మించి, దాన్ని ప్రభుత్వ యాజమాన్యానికి తీసుక రాగలిగేరు. వీరిలో కాఠిణ్యం-కారుణ్యం మిశ్రితమైన పితృహృదయం ఉంది. హరిజన విద్యార్థి లోకంలో ఎందరో మేధావంతులు. ఎందరో పట్ట భద్రులు విరాజిల్లడానికి వీరి అత్యద్భుతమైన క్రమశిక్షణ ఒక కారణం. వీరు నడపిన 'దీనబంధు' పత్రిక, ఆదిమాంధ్రోద్యమానికి అండయై, వివిధ హరిజన యువక రచయితలను ప్రోత్సహించేది. పత్రికాపతన మహద్భాగ్యం, పల్లె పల్లెల్లోనూ హరిజనులకు ప్రసాదించి-సాంఘిక చైతన్యానికి తోడ్పడిన మహావ్యక్తి! యధార్థంగా 'దీనబంధు'వై నేటికింకా హరిజనాభ్యుదయ కార్యక్రమంలో నిమగ్నులై వున్నారు. హరిజన విద్యార్థిలోకం వీరికెంతో ఋణపడివుంది.

## అస్పృశ్యుల దుస్థితి.

అస్పృశ్యతా తీవ్రత, పెద్ద పెద్ద బస్తీలలో సహితం కానవస్తున్న పరిస్థితుల్ని బట్టి 30 ఏండ్ల క్రిందట ఆంధ్రలో అస్పృశ్యుల దుస్థితి యెట్లుండెడిదో దురూహ్యం. సూత్ర ప్రాయంగా గ్రహించడానికి మిస్ మేయోఅనే రచయిత్రి 'మదర్ ఇండియా' అనే తన గ్రంథంలో అస్పృశ్యుల దుర్దశనుగూర్చిన విషయాలు పఠించాలి. అందులో "భారతదేశంలో అస్పృశ్యు లనబడేవారికి మానవ హక్కులు లేనే లేవు. భిక్షమెత్తుకోవడానికి కూడా వీరు రాజబాటల్లో నడవకూడదు. ఒకమూల దూరంగా నిలువబడి "మాలవాణ్ణి బిచ్చం బాబయ్యా" అని అరిస్తే సవర్ణులు దయదాల్చి



భిక్షంరోడ్డుప్రక్కను పడవేస్తారు. వారు కనుచూపుదూరం వెళ్ళాక రోడ్డుమీద ఎవ్వరూ లేకుండాచూచి, ఆభిక్షమాతడు స్వీకరించాలి." అని కన్నీటి బిందువుల్తో అస్పృశ్యతా చిత్రాన్ని చిత్రించింది. ఆమెకు మించి కీ. శే. శ్రీ కుసుమ ధర్మన్నకవి "నల్లదొరతనం" అనే గేయ గ్రంథంలో అస్పృశ్యుల ఘోరదుస్థితి సహేతుకంగా సర్వతోముఖంగా వర్ణించారు. కనుక ఆరెండు గ్రంథాలు పఠించిన వారు హరిజనుల దుస్థితి, కొంత ఊహించ గలరు. నేటి ప్రముఖ హరిజన రచయితలు స్వజాతీయుల దుస్థితికై ఎంతో ఆవేదనతో అశ్రువులు రాలుస్తూ పెక్కుగ్రంథాలురచించి నవ్యాంధ్ర సాహిత్య జగత్తు నలంకరిస్తున్నారు. కనుక అస్పృశ్యుల దుస్థితి మరొకసారి వివరించడంవల్ల అంతసముచితం కానేరదు.

## ఆదిమాంధ్రోద్యమం.

1917 వ సం॥రం కీ. శే. శ్రీ చింతా శేషయ్యగారు మాంటేగు ప్రభువుకు సమర్పించిన మెమోరాండంలో ఆదిమాంధ్రుల క్లిష్ట పరిస్థితులన్నీ సమగ్రంగా లిఖించబడ్డాయి. అదొక ములుకట్టువలె స్వజాతీయుల్ని ఒక ఉద్యమం వైపుకు మరల్చింది. అది విదేశీయుల రక్షణ, సహాయాలను అభివృద్ధి చేసింది. ఆ పిమ్మట నరాలశెట్టి దేవేంద్రుడుగారు స్వజాతీయ సేవాపరాయణులై మాలపల్లెల్లో సాంఘిక ప్రబోధాన్ని కలుగజేసేందుకు ఎన్నో సభలూసమావేశాలూ జరిపేవారు, వీరు ఆంధ్రహరిజన ప్రతినిధిగా రాష్ట్ర శాసన సభలో ప్రవేశించి ఆరోజుల్లో నవీనంగా యేర్పడిన లేబరు డిపార్టుమెంటు ద్వారా స్వజాతి కెన్నో ఘన కార్యాలొనర్చారు.

ఆంధ్రనిమ్నజాతుల సాంఘిక చరిత్రలో 1917 వ సం॥రం మిక్కిలి ఘననీయమవడానికి కారణం గమనించవలసి వుంది.

"ప్రపంచ కార్మికులారా ఏకము కండు"అనే అంతర్జాతీయ కార్మిక నినాదంలాంటి పిలుపు నిమ్నజాతీయులికికూడా వినిపించి నైజాం వాస్తవ్యులైన శ్రీ. మా. వెం. భాగ్యరెడ్డివర్మగారు 1915 లో ఆది హిందూ ఉద్యమాన్ని ప్రారంభించి నిమ్నజాతీయుల్ని ఏక నాయకత్వంక్రింద నడిపించారు. అందుచేత 1917 లో శ్రీ గూడూరి రామచంద్ర రావుగారి ప్రోత్సాహంవల్ల ఆంధ్ర నిమ్నజాతీయులు భాగ్యరెడ్డిగారిని ఆహ్వానించి బెజవాడలో చరిత్రాత్మకమైన ఒక మహాసభ జరుపుకున్నారు. వివిధ జిల్లాల ప్రతినిధులతో కూడిన మహాసభలో "రాష్ట్ర ఆదిమాంధ్ర సంఘం" నిర్మాణమయింది. ఆ ప్రథమ రాష్ట్ర ఆదిమాంధ్ర మహాసభా విశేషాలు వాడవాడల పాక్కి, నిమ్నజాతీయుల్లో ఆత్మవిశ్వాసం, నూత్న వికాసం, పెంపొందడానికొక విచిత్ర వాతావరణం కల్పించబడింది. జిల్లా, తాలూకాలవారీగా సంఘాలు నెలకొల్పబడ్డాయి. వాటిలో తూర్పు గోదావరిజిల్లా సంఘం, దినదినాభివృద్ధి పొంది ఆంధ్రరాష్ట్రాని కాదర్శప్రాయ మయింది.

శ్రీయ్యుత్తులు ఉండ్రు తాతయ్య,సుబ్బారావుగార్ల నాయకత్వం క్రింద ఉద్యమాదర్శాలు రాష్ట్రమంతా వ్యాపించాయి. శ్రీ కుసుమ వీరాస్వామి, వేంకటరామయ్యగార్ల రాజకీయపరిజ్ఞానం- కార్య దక్షత, ఆదిమాంధ్ర యువజనుల కాదర్శప్రాయమై, ఉద్యమాన్ని మరింత ఉద్దీపింపచేసింది. ఆ రోజుల్లో శ్రీ పండు లక్ష్మణస్వామి శ్రీ దిడ్ల పుల్లయ్య, శ్రీ కుసుమ ధర్మన్న మొదలైన ప్రముఖు లెందరో ప్రారంభ దశలో జాతి కమోఘమైన సేవ చేశారు. ఆ పిమ్మట శ్రీ పాము రామమూర్తి, శ్రీ ఈలి వాడపల్లి, కీ. శే. శ్రీహరి శ్రీ గెద్దాడ బ్రహ్మయ్యగార్ల నాయకత్వాన తూర్పుగోదావరి ఆదిమాంధ్ర సంఘం నవ చైతన్యంతో పర్థిల్లింది.



ఆంధ్ర హరిజనోద్యమాన్ని విపులీకరించవలసి వస్తే 1921 సం॥రం ఏలూరులో జరిగిన ద్వితీయ ఆదిమాంధ్ర మహాసభ, 1924 సం॥రం గుడివాడలో జరిగిన ద్వితీయ ఆంధ్ర అస్పృశ్యతా నివారణ మహాసభ 1932 శ్రీ బోయి భీమన్నగారి అధ్యక్షతను అమలాపురంలో జరిగిన యువజనమహాసభ 1936 లో భాగ్యరెడ్డి వర్మగారి అధ్యక్షతను తాళ్ళరేవులో జరిగిన నాయకుల మహాసభ మొదలైనవి సామాన్య ప్రజానీకాన్ని ఆకర్షించాయి. ప్రజలకు సంఘాలయొక్క ఆవశ్యకత తెలిసింది. వివిధప్రాంతాల్లో స్వజాతి సేవకై యెందరో నడుములు బిగించి ముందంజ వేశారు. శ్రీయుతులు పైనుదహరించిన నాయకు లెందరో హరి కథలు, నాటకాలు, సభలు, పత్రికలు, పాటలు, మొదలైన వాటి ద్వారా స్వసంఘ క్షేమాభివృద్ధికి ప్రచారం చేశారు. యానాం వాస్తవ్యులైన కీ. శే. మొసలి వెంకటస్వామిగారు, బర్మాకు వలస పోయిన నిమ్నజాతీయుల దుస్థితి బాపేందుకు, నిరుద్యోగ సమస్య నిర్మూలించేందుకు నిరక్షరాస్యత తొలగించేందుకు కీ॥ శే॥ శ్రీ అవటపల్లి నారాయణరావుగారి సహకారంతో దీనపోషక సమాజాన్ని నెలకొల్పి అఖండమైన సేవ చేశారు. దానిప్రాబల్యం వల్లనే ఆంధ్ర నిమ్నజాతీయుల్లో యానాంపుర హరిజనులు, నాగరికతలోనూ, విద్యలోనూ, వైజ్ఞానిక రంగాల్లోనూ, అగ్రతాంబూల మందుతూన్నారు. ఇదేవిధంగా వివిధ ప్రాంతాల్లో స్థాయిసంఘాలు లేబరు సంఘాలు, భక్తసమాజాలు, నెలకొల్పబడి ప్రభుత్వానికి తమ కష్టనష్టాలను విన్నవిస్తూ సంఘౌన్నత్యానికి దోహదమిస్తూన్నాయి. ఇట్టి పరిస్థితిలో కాంగ్రెస్ అస్పృశ్యతా నిర్మూలనోద్యమాన్ని ఆంధ్రలోకూడా సాగించి, ప్రజాదరణ పొందగలిగింది. కాకినాడ అఖిలభారత కాంగ్రెస్‌నాటికే, ఆంధ్ర నిమ్నజాతీయు

లెందరో కాంగ్రెస్ అండ చేరేరు. అందువల్ల ఆంధ్ర నిమ్నజాతీయుల్లో రెండు పార్టీ లేర్పడ్డవి. ఒకరు కాంగ్రెసును, మరొకరు ప్రభుత్వాన్ని బలపరచేవారు. ఈ వివాదంలో పదవీ వ్యామోహత, బహునాయకత్వం, చీడపురుగులై ఉద్యమ వృక్షాభివృద్ధికి నిరోధాన్ని కల్పించాయి. మొత్తంమీద దేశంలో ఏదో పెద్ద గాలి దుమారంలాగ రాజకీయ వాతావరణం వచ్చి పడగానే 1925 వ ప్రాంతానికి ఆర్థిక, సాంఘిక, రాజకీయ స్వాతంత్ర్య పోరాటంలో హిందు, ముసల్మానులతోపాటు, ఆదిమాంధ్రులుకూడా చేయి కలిపేరు. రాజకీయ పరిజ్ఞానవంతు లయారు.

1937 సం॥ర ప్రాంతంలో ఆదిమాంధ్ర నాయకులు ఒక ప్రక్క వివిధ జిల్లాల్లో కాంగ్రెసు ధనిక తత్వంతో విభేదపడి ఆదిమాంధ్రోద్యమాన్ని కాంగ్రెసుకు వ్యతిరేకంగా నడిపించారు. మరొకప్రక్క విద్యావంతులునూ మేధా వంతులును అయిన శ్రీ కూర్మయ్య, శ్రీ మూర్తి మొదలైనవారు ఆదిమాంధ్ర నాయకులై కాంగ్రెసును పూర్తిగా బలపరచారు. కాలానుగుణ్యంగా కొందరు కాంగ్రెసును కొందరు జస్టీసు పార్టీని మరికొందరు పీపిల్సు పార్టీని చేరి రాజకీయాల్లో పాల్గొన్నారు. ఐనప్పటికినీ వారందరూ జాతీయ క్షేమంకొఱకు "ఆంధ్రరాష్ట్ర లేబరు రక్షణ యూనియన్" అనే సమాఖ్యలో శ్రీ నేరేడుమిల్లి జగన్నాధంగారి ఆధ్వర్యాన చేతులు కలిపి పాటుపడ్డారు. తత్ఫలితంగా ఆదిమాంధ్ర ఉద్యమం, మన రాష్ట్రంలో ఒకబలీయమైన రాజకీయ పోరాటోద్యమంగా తయారయింది. కాని మరికొంతకాలం నాటికే నాయకుల్లో విభేదాలు కారుచిచ్చులా అంటుకున్నాయి. బహునాయకత్వం ప్రబలింది. ప్రజానీకంలో పెద్ద కలవరపాటు జనించింది. దానికి తోడు 7-3-1939 వ నాడు ఆదిమాంధ్ర నాయ



కాగ్రగణ్యులైన శ్రీ భాగ్యరెడ్డిగారు పరమపదించారు. సంఘం నావికుడు లేని ఓడ అయింది. 24-9-44 తేదీనుండి డాక్టర్ అంబేద్కరు ఆంధ్రదేశ సంచారం చేశారు.

తత్ఫలితంగా కొందరు ఆదిమాంధ్రనాయకులు షెడ్యూల్డు జాతుల ఫెడరేషనులో చేరి ఆదిమాంధ్రోద్యమంలో నూత్న శకాన్ని ప్రారంభించారు. అంతేకాకుండా, మనదేశంలో దిన దినాభివృద్ధి పొందుతూన్న కమ్యూనిష్టుపార్టీని మాతృసంస్థగా చేసుకుని ప్రబలిన వ్యవసాయకూలీ సంఘంలో శ్రీయుతులు నంబూరి శ్రీనివాసరావు, శ్రీ కాబోతు రామస్వామి, శ్రీ గుంటూరు బాపనయ్య మొదలైన ప్రముఖ ఆదిమాంధ్ర యువక నాయకులు, చేతులు కలిపి కార్మిక కర్షకుల ఆర్థిక స్వాతంత్ర్యం కోసం ఆదిమాంధ్రసంఘాలకు విముఖులయ్యారు. మొత్తంమీద ఆదిమాంధ్రుల్లో కాంగ్రెస్, కమ్యూనిష్టు, ఫెడరేషన్ రాజకీయపార్టీలు విజృంభించినప్పటికినీ, రాష్ట్ర ఆదిమాంధ్రసంఘం శాఖోపశాఖలతో విశ్వవ్యాపితమైన వట-వృక్షంలా-ఒకప్పుడు, ఆకులు రాల్చి మోడై మరొకప్పుడు చిగిరించేటట్టు గోచర మౌతూంటుంది. కాని ఈ ఉద్యమంయొక్క సమగ్ర చరిత్ర ఉద్ధానపతనాలతో సమ్మేళనమైనట్టు సుస్పష్టమౌతూంది. 23-12-46 వ నాటి 14 వ రాష్ట్ర సహాసభా కార్యక్రమం ఎంతో వైభవంగా కర్నూల్లో శ్రీరాయుడు గంగయ్యాగారి అధ్యక్షతను జరిగింది-కాని దురదృష్టవశాత్తు 15 వ వార్షికోత్సవం నాటికే సంఘంలో అనైక్యత - వైరుధ్యాలు ప్రబలిపోయాయి. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసులోని ప్రముఖ నాయకుల పాబల్యం. ఆదిమాంధ్రనాయకుల్లోనికి చొరబడి ప్రజాస్వామ్య సూత్రాలకు విరుద్ధంగా, పామరులో శ్రీ. టి. వీరరాఘవులు బి. యె. బి. యల్. అధ్యక్షతను ఒక 15 వ రాష్ట్రసభ జరిగింది.

దాన్ని త్రోసిపుచ్చి గుడివాడలో 23-6-47 వ నాడు శ్రీ కమతం షన్ముఖం. యం. యల్. ఏ. అధ్యక్షతను 15 వ రాష్ట్ర మహాసభ, వివిధ జిల్లాల ప్రతినిధులతో మిక్కిలి వైభవంగా జరిగింది. ఇట్టి సంక్లిష్ట వివిధ పరిస్థితుల్ని తొలగించేందుకు యువక నాయకాగ్ర గణ్యులైన శ్రీ యస్. నాగప్ప శ్రీ టి. జియ్యరుదాసు . శ్రీ వి. చినకేశవులు, శ్రీ బోయి భీమనకవి మొదలైనవారెంతో కృషి చేసి, సంఘాన్ని పునర్నిర్మాణం చేయవలసివుంది. భాషా ప్రయుక్త రాష్ట్ర విభజనకు భారత ప్రభుత్వం ఆమోదించిన శుభసమయాన్ని, ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర స్వాతంత్ర్యంలో ఆదిమాంధ్రులు తమ న్యాయ సమ్మతమైన, ఆర్థిక. సాంఘిక. రాజకీయ,హక్కుల్ని పొందడానికి. మిక్కిలి జాగరూకులై వుండాలి. ముఖ్యంగా, నాయకులు తమలో తమకు గల కొన్ని కుల. వర్గ. సాంప్రదాయ విభేదాలను దూరం చేసుకుని, ఒక నిర్ణీత-కార్యక్రమాన్ని అనుసరించి, ఆదర్శప్రాయులై సంఘసేవాపరాయణు లవ్వాలి.

## ఆంధ్ర హరిజన సేవాసంఘం.

అఖిలభారత హరిజన సేవాసంఘం, రాష్ట్ర జిల్లాల వారిగా సంఘాలు నెలకొల్పి, దాని నిర్ణీతమైన కార్యక్రమం కొనసాగించిన సందర్భాల్లో కాంగ్రెస్ అభిమానులంతా హరిజన సేవకులయారు. ముఖ్యంగా కీ. శే. కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు గారు సేవాసంఘానికి అధ్యక్షులై అస్పృశ్యతా నిర్మూలనానికెంతో కృషి చేశారు. ఎంతో ధనం విరాళమిచ్చారు. తత్ఫలితంగా ఆంధ్ర హరిజన సేవాసంఘం, పెక్కు హరిజన విద్యార్థి, విద్యార్థినీ వసతి గృహాలు నిర్మించగలిగింది. అనుబంధంలో సూచించిన కొందరు



ప్రముఖ హరిజనసేవకులు, సకలకష్టాలకీ సహించి, సంఘ బహిష్కరణాన్ని లెక్కచేయక ఉద్యమంలో చేరి సేవచేశారు.

అందులో శ్రీ తల్లాప్రగడ ప్రకాశరాయుడు, నరశింహవర్మ, శ్రీ నల్లపాటి హనుమంతరావు, శ్రీ వెల్లంకి కృష్ణమూర్తి, శ్రీ మాగంటి బాపినీడు, మొదలైనవారు అహోరాత్రాలు విశేష శ్రమకోర్చి సంఘానికి సేవ చేశారు. చేస్తున్నారు. రాజకీయ సిద్ధాంతాల్లో ఎవరెన్ని మార్పులు చెందుతూన్నా శ్రీ బాపినీడుగారు తన ప్రధాన ఆదర్శమైన హరిజనాభ్యుదయాన్ని వీడలేదు. వీరు సేవాసంఘానికి ఆదర్శమైన ప్రధాన కార్యదర్శియైన రోజుల్లో అస్పృశ్యతా నిర్మూలనోద్యమం అతి ఉత్సాహకరంగా నడిచింది. హరిజన విద్యాసంస్థలు ఎక్కువ అభివృద్ధి పొందాయి. కాని 1944 ప్రాతంనుండి ఆంధ్ర హరిజన సేవాసంఘంలో ఏదో ఒక జీవకళ లోపించినట్లు చరిత్రకారులుకి గోచరమౌతుంది. ఏకారణాలెట్లున్నా కాంగ్రెసు నాయకుల్లో పదవీ వ్యామోహత ప్రబలి, హరిజన సేవా కార్యక్రమాన్ని వెనుక పెట్టారు. తరువాత హరిజన సేవకై భూరి విరాళాలిచ్చే త్యాగశీలురు సంఘంలో లోపించారు. "పిండికొద్దీ రొట్టె" అన్న సామెత లోకవిదితమే కదా! నేటి హరిజనసేవా సంఘాధ్యక్షులైన శ్రీ బి. యస్. మూర్తిగారు స్వజాత్యుద్ధరణ కెంత ఆవేదన పడుతూన్నా, జరుగవలసినంత కార్యక్రమం సత్వరంగా జరుపలేకున్నారు.

తాత్కాలికంగా చెమ్మనేలమీద తాటాకు పాకలుగా నిర్మించిన హరిజన వసతి గృహాలు నేటికైనా నిర్మూలించి, ఆరోగ్యమైన స్థలాల్లో చక్కని వసతి గృహాలు నిర్మించవలసి వుంది. ఈ ఉత్తమ కార్యానికి ఆంధ్రప్రజానీకం ఎంతో సహకరించవలసి

వుంది. రాష్ట్రప్రభుత్వం గృహ నిర్మాణానికై వెచ్చించ దలచిన ధనం నుంచి హరిజన సేవాసంఘానికి కొంత ప్రాప్తించేటట్లు ఆందోళన జరగాలి.

## గత కాంగ్రెస్ మంత్రివర్గం.

1937 లో కాంగ్రెస్ 7 రాష్ట్రాల్లో మంత్రిపదవులు స్వీకరించారు. మన రాష్ట్రానికి శ్రీ రాజగోపాలాచారి ప్రధాని కాగానే ఆంధ్ర హరిజనుల నోటిలో బెడ్డకొట్టి అరవసోదరుడు శ్రీ మునిస్వామి పిళ్ళెగారికొక మంత్రిపదవి లభింపచేశారు. శ్రీ బి. యస్. మూర్తిగారికొక కార్యదర్శిపదవి యేర్పాటుచేశారు. దానితో హరిజన సమస్య పరిష్కారమైనట్లు భావించి చల్లగా వూరుకున్నారు. అస్పృశ్యుల క్షేమాన్ని యీ ప్రభుత్వం తలపెట్టలేదన్న అరోపణకు కారణాలు లేకపోలేదు. జాతీయ పాఠశాలల వ్యాప్తికి, హింధీ భాషావ్యాప్తికి పెక్కు యేర్పాటులు చేయడంవల్ల వందలకొద్దీ అస్పృశ్యుల పాఠశాలలు మూసివేయబడ్డవి. అనేకచోట్ల అస్పృశ్యులు కోరిన బంజరుభూముల సేవ్యం నిరాకరింపబడింది. యం. సి. రాజా ప్రవేశపెట్టిన దేవాలయ ప్రవేశపు బిల్లు బుద్ధిపూర్వకంగా నిరాకరించారు. అస్పృశ్యుల పౌరసత్వపు హక్కుల రక్షణ కేవిధంగానూ, కాంగ్రెస్ ప్రభుత్వం అభయం యివ్వలేకపోయింది. అందుచేత కాంగ్రెసు విధానాన్ని హరిజనులు శంకించారు. మరి కొంతమంది కాంగ్రెసుకు రాజీనామాలు పెట్టి జాతీయ గౌరవాన్ని కాపాడుకున్నారు. వారంతా "కాంగ్రెసులో మనకేమాత్రం స్వేచ్ఛలేదు. మన హక్కుల్ని పొందడానికి మనకొక ప్రత్యేక రాజకీయ పార్టీ అత్యవసరం" అని నిమ్న జాతీయుల్లో ప్రచారం సాగించారు. ఎవరెట్లు విమర్శించినా పదవులు స్వీకరించి కాంగ్రెస్ ప్రధాన



కర్తవ్యాన్ని కొంత విడనాడినమాట వాస్తవమే కదా! ముఖ్యంగా హరిజనలోకానికి జరిగిన అన్యాయాన్ని సవరించుకోడానికి వీల్లేకుండా ప్రపంచ యుద్ధకారణంవల్ల కాంగ్రెసు మంత్రివర్గం కొద్ది కాలంలోనే గద్దె దిగవలసి వచ్చిన విషయం లోకవిదితం.

## నిమ్నజాతుల ఫెడరేషన్ — ఆంధ్రశాఖ.

అఖిలభారత నిమ్నజాతుల సమాఖ్య 1942 వ సం॥రంలో అస్పృశ్యుల ఆర్థిక సాంఘిక, రాజకీయ హక్కుల్ని కాపాడే నిమిత్తం డాక్టర్ అంబేద్కర్‌చే సంస్థాపించబడింది. ఈసమాఖ్య యొక్క ప్రధానోద్దేశాలన్నీ సుప్రసిద్ధమైన నాగపూర్ మహాసభ తీర్మానాల్లో ప్రకటితమయ్యాయి. అందులో "భారతదేశ రాజ్యాంగ విధానం, అస్పృశ్యుల అంగీకారంతో నిర్ణయించబడాలి. భారత జాతీయ జీవితంలో అస్పృశ్యులు ప్రత్యేక తెగగా గుర్తించబడాలి. శాసన సభల్లోనూ, స్థానిక సంస్థల్లోను, అస్పృశ్యులకు యివ్వబడిన స్థానాలకు ప్రత్యేక నియోజకవర్గాలద్వారా ఎన్నికల్లు జరగాలి" అనే విషయాలు ప్రధానమైనవి. నిమ్నజాతుల సమాఖ్యకు శ్రీ యన్. శివరాజు అధ్యక్షుడుగాను. శ్రీ బి. యన్. రాజభోజ్ ప్రధాన కార్యదర్శిగానూ వుండి, కాంగ్రెస్ వ్యతిరేకప్రచారానికి తోడ్పడి, వివిధ రాష్ట్రాల్లో సమాఖ్యను బలపర్చారు. వంగదేశంలోని 'పీపిల్సు హెరాల్డు' అనే పత్రికద్వారా, సమాఖ్యా ప్రచారం మిక్కుటంగా జరిగింది. శ్రీ జోగేంద్రనాధ్ మండల్. శ్రీ కె. ఆర్. విశ్వంబరన్. (కొచ్చిన్) శ్రీ హరిలాల్ కస్వార్ (అలహాబాదు) శ్రీ హెచ్. యం. జగన్నాధం (మదరాసు) మొదలైన ప్రముఖులతో, ఫెడరేషన్ దేశ వ్యాపితమై నిమ్న జాతీయుల్లో స్వజాతీయాభిమానాన్ని రేకెత్తింప గలిగింది. కాంగ్రెసు ప్రభుత్వ విధానాన్ని నిరసించేందుకు, 1944 లో పూనాలో సత్యాగ్రహోద్య

మాన్ని దిగ్విజయంగా నడిపి ఫెడరేషన్ నాయకులు అరెస్టయ్యారు. కాని, సామ్రాజ్యవాదులైన ఆంగ్లేయుల్ని, భారతదేశం నుండి పారద్రోలడానికి కృషిచేయలేకపోయింది. నేటికైనా జాతుల సమస్య, దేశస్వాతంత్ర్య సాధనతో సులభంగా పరిష్కారమౌతుందన్న సామాన్య ధర్మాన్ని, సమాఖ్యానభ్యులు నేడు సంపూర్ణంగా విశ్వసించవలసివుంది. ప్రపంచ మహామేధావుల్లో ఒకరైన డాక్టర్ అంబేద్కరు, కాన్స్టిట్యుయెంటు అసెంబ్లీ సభలో ఒక సభ్యుడై, మైనారిటీ రక్షణ చట్ట నిర్మాణ ఉపసంఘంలో సభ్యుడైనప్పటి నుండీ, ఫెడరేషన్ గమ్యస్థానంలో ఒక విచిత్రమైన మార్పు సంభవిల్లింది. ప్రత్యేక నియోజిక వర్గసూత్రాన్ని కొంత సవరించి, డా॥ అంబేద్కర్ కాంగ్రెసుతో సహకరించడమే దాని విశిష్టత.

ఆంధ్ర : నిమ్నజాతుల ఫెడరేషన్.

కీ. శే. నందనార్ హరి, విద్యార్థి దశనుండి, స్వజాతీయ సేవాదీక్షతో, నిత్యకార్యోత్సాహంతో, ప్రముఖ హరిజన నాయకులతో, హరిజనాభ్యుదయ కార్యక్రమాన్ని గూర్చి చర్చించేవాడు. ముఖ్యంగా, శ్రీ పి. రామమూర్తి, శ్రీ జి. బ్రహ్మయ్య, శ్రీ ఈలి వాడపల్లి గార్ల జిల్లాసంఘ నాయకత్వంలో విభేదాలు ప్రబలమైన కారణాలవల్ల యువకుడైన హరి, సంఘసేవలో ఆదర్శప్రాయుడైన శ్రీ వాడపల్లిగారిని బలపర్చి, దేశీయ రాజకీయ, సాంఘిక పరిస్థితుల్ని, ప్రజలకు బోధించాడు. ఇంతకుపూర్వమే 'అంబేద్కర్ వాతావరణం' ఆంధ్రహరిజన లోకానికి శ్రీ కీ. శే. కుసుమ ధర్మన్న తన "జయభేరి" పత్రికద్వారా కలగజేసారు. 14-10-1935 లో డాక్టర్ అంబేద్కర్ "ఇయోలా" పట్టణ మహాసభలో "అంటరాని వాడననే కళంకంతో పుట్టే దురదృష్టం



నాకు దాపరించింది. అదినాతప్పిదం కాదు. నేను హిందువుడిగా చావను" అని యేనాడు శపథం చేశాడో నాటినుండి అస్పృశ్యుల మతాంతరోద్యమానికి అంద చందాలు దిద్ది ధర్మన్నకవి- అంబేద్కర్ పేరు ప్రఖ్యాతులకు మిక్కిలి కృషిచేశారు. ఇట్టి పరిస్థితుల్లో, డా॥ అంబేద్కరును ఆంధ్రదేశ సంచారానికి ప్రోత్సహించి, శ్రీ హరి, తన రాజకీయ పరిజ్ఞానమంతా వినియోగించి, ప్రతీ తాలూకాలోనూ పెద్ద స్వాగత మహాసభలు యేర్పాటు చేయగలిగేడు. జాతీయ సేవలో ఆరితేరిన యువకనాయకులు శ్రీ గోవాడ పరీక్షణరావు, శ్రీ మోకా మీరయ్య, శ్రీ వాసే నాగేశ్వరరావు డాక్టరు మత్తే నరసింహం, శ్రీ బద్దే ప్రకాశరావు మొదలైనవారంతా అంబేద్కర్ టూర్ ఆర్గనైజర్సుగా మన రాష్ట్రంలో చాల ప్రాంతాలకు వెళ్లి, ఫెడరేషన్ సిద్ధాంతాలను ప్రచారం చేసారు. తత్ఫలితంగా నిమ్నజాతీయుల హృదయాల్లో ఫెడరేషన్ బీజాలు నాటుకున్నాయి. అంబేద్కర్ ఆంధ్రదేశం విచ్చేసి ప్రజానీకానికి ఒక విప్లవోజ్వలమైన సందేశాన్ని యిచ్చారు. తదనంతరం శ్రీహరి, వొక అసిస్టెంటు పబ్లిసిటీ అండ్ రిక్రూటింగు ఆఫీసరుగా ఉద్యోగం స్వీకరించి, దేశ సంచారియై, ఫెడరేషన్ నిర్మాణానికి అహోరాత్రాలు కృషిచేసాడు. ఇట్టి సాంఘిక పరిణామావస్థలో, కొవ్వలి గ్రామంలో- సవర్ణహైందవ భూస్వాములకు- నిమ్నజాతీయులకు, బంజరుభూమి (చెరువు) సందర్భంలో పెద్ద సంఘర్షణ తటస్థించింది. అందువల్ల 3-6-46 వ నాడు రాష్ట్ర షెడ్యూల్డు జాతుల ప్రథమ మహాసభ, కొవ్వలిలో జరుపబడింది. ఆచరిత్రాత్మక మహాసభా నిర్వాహకుల్లో శ్రీ నక్కా చినవెంకయ్యగారు, శ్రీ నంబూరి శ్రీనివాసరావుగార్లు అగ్రగణ్యులైన కారణం చేత, సవర్ణులు శ్రీ చినవెంకయ్యగారిని తీవ్రంగా గాయపర్చారు.

తత్కారణంవల్ల రాష్ట్ర నిమ్నజాతీయుల్లో పెద్ద కలవరపాటు కలిగింది. నిమ్న జాతుల సమాఖ్య మిక్కిలి బలపడింది.

అఖిలభారత షె. జా. ఫెడరేషను నిరాహ్వాకుల్లో- శ్రీ ఈలి వాడపల్లిగారొకరుగా వున్నారు. రాష్ట్రసంఘానికి శ్రీ పి. గోపాల కృష్ణగారు, శ్రీ కోనాడ సూర్యప్రకాశరావుగారు ప్రధాన కార్య దర్శిగాను వుంటున్నారు. సంఘం తరపున "జైభీమ్" తెలుగు, ఆంగ్ల వారపత్రికలు ప్రచురించబడుతూన్నవి. శ్రీహరి సజీవుడై యున్న కాలంలో జైభీమ్ పబ్లిషింగ్ హౌస్ పెక్కు గ్రంథాలను ప్రచురించింది. కాని ఆశ్చర్యకరంగా- ఎంత త్వరితంగా ఫెడరేషన్ విజృంభించిందో, అంత త్వరితంగా అది దాని గమ్య స్థానానికి దూరమయ్యింది. దానికి కారణం, అంతర్జాతీయ రాజ కీయాల్లో మార్పు కలగడం, తాత్కాలిక భారత ప్రభుత్వంలో ఫెడరేషనుకు ప్రాతినిధ్యం లేకుండా పోవడమే అని రాజకీయ క్షేత్రల అభిప్రాయం. ఏ వెట్లున్నప్పటికినీ, విద్యార్థులు- విద్యా వంతులు, ఫెడరేషన్ను బలపరుస్తూన్నారు. భూస్వాములు శ్రీ పిట్టా వేంకటేశులువంటి, యువకనాయకుడు, స్వజాతి సేవకై ఎంతో ధనం వెచ్చిస్తూన్నారు. శ్రీ వస్కా సుబ్రహ్మణ్యం, శ్రీ పి. సరస్వతిరావు, శ్రీ సబ్బాస్వామి, శ్రీ బొజ్జా చినఅప్పల స్వామి వంటి ఉత్సాహవంతులు, ఫెడరేషన్ అభ్యుదయానికి మిక్కిలి దోహదమిస్తున్నారు. శ్రీ సరిపెల్లి వీరన్న, శ్రీ బి.వెంకట రెడ్డి వంటి గాయకులు బుర్రకథలు ద్వారా తీవ్రమైన ప్రబోధాన్ని చేస్తున్నారు. కాని ఫెడరేషన్ భావిపురోగమనం ఏ దిశకో- నిర్ణ యంకాలేదు. గమ్యస్థానాన్ని ఎవరు నిర్ణయించగలరు ? కాలాను గుణ్యంగా- భారత రాజకీయ పరిస్థితుల్ని బట్టి, నిమ్న జాతీయ



భావి పౌరులంతా- కులసమస్యను వీడి, ఆకలి సమస్యను పరిష్క రిస్తూ తమ గమ్యస్థానాన్ని నిర్ణయించుకోగలరు గదా !

## ప్రబోధ సాహిత్య సమితి—

గత గోదావరీ పుష్కర మహోత్సవాల్లో మహాకవి శ్రీ జాషువాగారి ఆధ్వర్యాన్ని, పలువురు హరిజన రచయితలు రాజమండ్రిలో సమావేశమై, హరిజనాభ్యుదయానికై సాహిత్య, కళోపాసకుల కర్తవ్యాన్ని గూర్చి, చర్చించారు. ఆనాటి సాహిత్య గోష్ఠిలో సుప్రసిద్ధకవివరేణ్యులైన శ్రీ నేతినూరి గంగాధరం, శ్రీ కుసుమ ధర్మన్న, శ్రీ బోయి భీమన్న, శ్రీ పోలుకొండ భద్రయ్య, శ్రీ జాలా రంగస్వామి మొదలైనవారు పాల్గొన్నారు. ఆసభకు వివిధ ప్రాంతాలనుండి, నిమ్నజాతీయ రచయితలు, గాయకులు, నటకులు, చిత్రకారులు విచ్చేసి "ప్రబోధ సాహిత్య సమితి" సంస్థాపనకు తోడ్పడ్డారు. ఈసమితి సభ్యుల గేయాలే, నిమ్నజాతీయుల్లో నిజమైనవిప్లవ చైతన్యాన్ని రేకెత్తింపగలిగాయి.

అనుబంధంలో సూచించిన రచయితల గ్రంథాలు పరిశీలిస్తే, ప్రబోధ సాహిత్యసమితి యొక్క ప్రత్యేకత గ్రహించవీలౌతుంది. సంఘోద్ధరణకై, విజ్ఞాన సంస్కృతీ వికాసాలను ప్రజల కందిం చాలనే ఉత్తమ ఆశయంతో, సభ్యులు చేసే కృషి మిక్కిలి ప్రశంసనీయం. భాషాభిమానులు, హరిజన శ్రేయోభిలాషులు, రాష్ట్ర ప్రభుత్వం- ఈసాహిత్య సమితిని ప్రోత్సహించి, ఎంతో అభ్యుదయ కార్యక్రమాన్ని నిర్వహించవలసి వుంది. నిమ్న జాతీయ రచయితలెల్లా ఈ సమితిలోచేరి, అస్పృశ్యతా భూయిష్ట మైన సంఘంలో విప్లవానికి తోడ్పడే అభ్యుదయ ప్రబోధ సాహి త్యాన్ని ఎంతో సృష్టించ వలసి వుంది.

## నేటి ప్రజా ప్రభుత్వం.

యుద్ధానంతరాన్ని రాష్ట్రఅసెంబ్లీ యెన్నికల సంరంభం దేశాన్నంతా కలవర పెట్టింది. ఎన్నికల్లో పోటీచేసిన వివిధ ప్రజా సంస్థలు వాటి వాటి సిద్ధాంతాలను ప్రజల్లో ప్రచారం చేసుకోవడానికి వాక్స్వాతంత్ర్యం లభించింది. ఆయా పార్టీలు ప్రజానీకాని కందించిన ప్రణాళికల్లోని విషయాలు మిక్కిలి ఆకర్షనీయంగా వ్రాయబడ్డాయి. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రణాళికలో హరిజనులకు సంబంధించిన ముఖ్యాంశాలివి. "వెనుక బడియున్న జాతుల అభివృద్ధికై అవుసరమైన యేర్పాట్లన్నీ చెయ్యాలి. షెడ్యూల్డు తరగతుల విద్యాభివృద్ధికీ సాంఘిక, ఆర్థికాభివృద్ధికీ తోడ్పడాలి." ఈ విషయాన్ని బట్టి కాంగ్రెసు మహాసంస్థ హరిజనుల పట్ల ఎంతేని సుహృద్భావం కలిగి వుందని పాఠకులు గ్రహించగలరు. ఐతే ప్రణాళికలో వున్నంత ఉదారంగా రాష్ట్ర కాంగ్రెస్ సంఘాలు సమర్థులైన అసెంబ్లీ సభ్యుల్ని నియమించలేకపోయింది. పార్లమెంటరీ బోర్డులో శ్రీ కూర్మయ్యగారొక సభ్యులైనప్పటికీ ఆలాంటి పొరపాటు జరగడానికి కారణం విద్యావంతులైన హరిజన యువకులు కాంగ్రెస్ రాజకీయాల్లో చేతులు కలపకపోవడమే ప్రధాన కారణమని తెలియవస్తుంది. ఏ వెట్లున్నా పూనా ఒడంబడిక ప్రకారం 90 లక్షల జనాభాగల మద్రాసురాష్ట్ర నిమ్నజాతులకు 30 స్థానాలు మాత్రమే ప్రత్యేకించబడడంవల్ల, జనాభాను బట్టి సరియైన ప్రాతినిధ్యం లభించలేదని విశదమౌతుంది. ఇది సమకూడ నందువల్ల విశాల దృష్టిగల కాంగ్రెస్ ఏకొన్ని జనరల్ సీట్లకైనా హరిజనాభ్యర్థుల్ని నియమించి గెలిపించవలసింది. అది లేదు సరిగదా జనరల్ సీట్లకు పోటీచేసినవారిని నిరుత్సాహపర్చింది. ఇక 30 మంది హరిజన శాసన సభ్యులికీ ఒక్క మంత్రిపదవి. ఒక కార్యదర్శి పదవి దయాధర్మ భిక్షంగా యివ్వబడ్డాయి. ఐతే ఒక్కటే విశేషం. గతసారి అరవప్రధాని అరవ హరిజనుణ్ణి మంత్రిగా చేస్తే యీసారి ఆంధ్రకేసరి ప్రకాశంపంతులు శ్రీ వేముల కూర్మయ్యగారిని మంత్రిగా నిర్ణయించారు. కనీసం అవుసరాలను బట్టి కాకపోయినా, ఆంధ్ర, తమిళ ప్రాతినిధ్యాల గూర్చి కూడా కాకపోయినా జనసంఖ్యను బట్టిగాని, శాసన సభ్యత్వాలను బట్టిగాని మంత్రిపదవుల ప్రాతినిధ్యం నిర్ణయిస్తే హరిజనులకు తప్పక రెండు లేక మూడు స్థానాలు వచ్చి తీరవలసింది. ఐతే మన కాంగ్రెసు ప్రజాప్రభుత్వాల్లోకూడ ఫేసిస్టు హై కమేండు ఏదో మూలనుండి నిరంకుశత్వాన్ని చెలాయిస్తూ వుండడంవల్ల హరిజనులకు జరుగవలసిన న్యాయం జరగలేదు. దీనికి బాధ్యులు హరిజన శాసనసభ్యులే కదా!

## ప్రధాని ప్రకాశం - కోటి రూపాయలు!

ప్రకాశం పంతులుగారిలో సహజ సంఘ సంస్కరణాసక్తి మూర్తీభవించడంవల్ల, వారి విద్యార్థి దశనుండీకూడా, నిమ్న జాత్యుద్ధరణా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. తిలక్ స్వరాజ్య నిధినుండి ఆంధ్ర నిమ్నజాతులకు కేటాయించిన ధనం సద్వినియోగపర్చి, తదనంతరం, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడుగా నిమ్నజాతులయెడ ప్రత్యేక శ్రద్ధవహించి సేవ చేసారు. ఆంధ్ర ప్రజానీకంయొక్క మన్ననలకు పాత్రులైనట్టే హరిజనుల గౌరవాభిమానాలను కూడ చూరగొనగల్గారు. వీరు ప్రధాని కావడం వల్ల ఆంధ్ర హరిజనలోకం ఎంతో హర్షించింది. పంతులుగారు క్రొత్త క్రొత్త సీములు తయారు చేయడంలో ప్రవీణులవడం వల్ల

హరిజనాభ్యుదయానికి కూడ ఒక నవీనమైన స్కీము తయారు చేసి, దానినిమిత్తమై ఒక కోటి రూపాయలు రాష్ట్ర బడ్జట్టునుండి ప్రత్యేకించినట్లు పంతులుగారు ప్రకటించారు. ఆస్కీము ఎలాం టిదో. అది అస్పృశ్యతా నిర్మూలనానికెట్లు తోడ్పడుతుందో. ఎట్లా హరిజన నిరుద్యోగుల సమస్య పరిష్కారమౌతుందో అని దేశస్థులంతా ఎదురు చూచారు. 11 మాసాల కాంగ్రెస్ ప్రభుత్వంలో నూతనంగా, టెక్స్టైల్ - ఖాదీ - డెవలప్‌మెంటు - ఇండస్ట్రియల్ - ప్రొహిబిషన్ - విలేజీప్రోరిక్రియేషన్ - 'ఉత్పత్తి కొనుగోలుదార్ల' సంఘాలు - మొదలైన డిపార్టుమెంటులు నెలకొల్ప బడ్డాయి. ఎందరో బ్రాహ్మణ, కాంగ్రెస్ భక్తులు, త్యాగులు ఉన్నతోద్యోగు లుగా నియమించబడ్డారు. హరిజనులకు ఒక కోటి రూపాయలు. ఒక హరిజన మంత్రి ఉన్నారు కదా అన్నట్లు, పై డిపార్టుమెం టుల్లో నిమ్నజాతీయులకి ప్రాతినిధ్యం లేకుండా చేశారు. దానికి తోడు హరిజనాభ్యుదయ కార్యక్రమం పూర్తిగా మరువబడింది. అందువల్ల ఆకోటిరూపాయలగురించి కొందరు" It is a promissing budget but not practical budget" అని విమర్శించారు. మరికొందరు "ఏడిస్తే ఎలక్కాయ చేతికిచ్చి ఊరుకుంటే ఊడ లాక్కోవడం లాంటిదే కోటి రూపాయల వాగ్దానం" అని శంకిం చారు. హరిజనాభ్యుదయ కార్యక్రమాన్ని ప్రకాశంగారు జార విడిస్తే హరిజన మంత్రి కూర్మయ్య గారేల మౌనం వహించారన్న ప్రశ్నకు సమాధానం, తీగ లాగితే డొంకంతా కదిలినట్లు మద్రాసు రాజకీయాలన్నీ వివరించవలసి వుంటుంది. ఒక విధంగా ప్రకాశం ప్రభుత్వంలో వ్యక్తి స్వాతంత్ర్యం లేక హరిజనమంత్రి తన జాతి పురోభివృద్ధికి, ఏలాంటి కార్యక్రమాన్ని ప్రజానీకాని కందించలేక పోయినట్టు సుస్పష్టమయింది. ఆలాంటి రాజకీయ కారణాలవల్ల



శ్రీకూర్మయ్యగారు తన "సమాచార, హరిజనాభ్యుదయ" డిపార్టు మెంటుల మంత్రిత్వానికి రాజీనామాకూడా పెట్టారు. అదెంతవరకు సముచితమో రాజకీయవేత్తలు నిర్ణయించగలరు. ఆ వింత రాజ కీయ పరిణామం వల్ల వ్యక్తిగతంగా ప్రకాశంగారికి అన్యాయం వాటిల్లింది. అది ఆంధ్రులకే తీరని కొరత. ముఖ్యంగా ప్రకాశం గారి హరిజనాభ్యుదయ కార్యక్రమం తలక్రిందులయింది.

హరిజనయువకనాయకుడు యస్. నాగప్ప యం. యల్. ఎ గారు శాసన సభల్లో పెక్కుసార్లు హరిజనాభ్యుదయాన్ని గూర్చి ప్రశ్నించారు. శ్రీ బోయి భీమన్న బి. యె. సహాయ ప్రచురణ శాఖాధికారి హరిజనాభ్యుదయాని కెన్నో సూచనల నిచ్చారు. ముఖ్యంగా శ్రీపాము రామమూర్తి బి. యె. బి ఇ డి గారు హరి జనాభ్యుదయానికి ప్రభుత్వం ఏం చేయవలసి వుందో ప్రధానికి మెమోరాండం సమర్పించారు. సుప్రసిద్ధమైన శ్రీ మూర్తిగారి నవ జీవన పత్రిక హరిజనాభ్యుదయానికి పెక్కు సంపాదకీయాలు వ్రాసింది. అవన్నీ అడవి గాచిన వెన్నెల్లా నిష్ప్రయోజన మయాయి. కారణం ప్రకాశంగారు హరిజన నాయకుల కోర్కెలను మన్నించ కుండా స్వతంత్రంగా హరిజనాభ్యుదయ ప్రణాళిక తయారు చేశారు. అది 24 మార్చి ఆంధ్ర పత్రికలో ప్రకటించబడింది. అందులో కొన్ని భాగాలు పరిశోధించవలసి వుంది.

1. "కులాచార వివక్షత లేకుండా సర్వ కులాలవారు ఏలా నివసించాలో తార్కాణ పూర్వకంగా చూపడానికి ఆదర్శగ్రామాలు స్థాపించడం .... ప్రభుత్వ ఫిర్కా కార్యక్రమాలవల్ల ఇట్టి సదవ కాశం లభిస్తుంది. మొత్తం 34 ఫిర్కాల్లోనూ 230 ఎకరాల భూమిలో 34 వలస గ్రామాలు ఒక్కొక్క వలసకి 100 గృహాలు చొప్పున నిర్మించాలి.

2. 34 ఫిర్కాల్లో 258 గ్రామాలు 17 బస్తీలు వున్నాయి. వీటిలో హరిజనేతర్లు నివసిస్తున్న ప్రదేశాల్లో గ్రామానికి పదేసి యిళ్ళచొప్పున కట్టించి హరిజనుల నివాసానికివ్వడానికి 285 ఎకరాలు కొనాలి. అందువల్ల భూములుకొని, పై రెండు కార్యక్రమాల ద్వారా 11,980 గృహాలు నిర్మించడానికి మొత్తం 70 లక్షల రూ॥లు అవుతుంది, బస్తీలలో హరిజనుల వసతి నిమిత్తం బస్తీ 1కి 50 యిళ్ళచొప్పున నిర్మించడానికి స్థానిక సంస్థల్ని ప్రోత్సహించేందుకు రు 4,25000 లు.

ఈఖర్చులు పోగా 25 లక్షలు మిగులుతాయి.

3. ఇప్పటి దైన్యాన్ని తొలగించడానికి తగిన విద్య హరిజన విద్యార్థుల కివ్వాలి. వారికివ్వబడుతున్న ధనసహాయం చాలకపోతే ఈ నిధినుంచి వారికి కావలసిన ధనాన్ని భర్తీచేయాలి. ఇందుకు 3 లక్షలు.

4. మద్రాసులో నూరుగురు హరిజన విద్యార్థులను ప్రత్యేక బోధనాలయంలో ఆరుమాసాలు శిక్షణ యిచ్చేనిమిత్తం ఒక లక్ష.

5. పారిశ్రామికాది విద్యలలో హరిజనులకు ప్రస్తుతం చాలినన్ని సౌకర్యాలు లేవు. కనుక భోజన వసతి సహాయాలతో కూడిన విద్యాలయాలను స్థాపించే నిమిత్తం 5లక్షలు. ఎనిమిది లక్షలు నిలవుంచాలి.

ఆదర్శప్రాయమైన గ్రామ నిర్మాణానికి డెవలప్‌మెంటు కమీషనరు ఒక నిర్దుష్టమైన కార్యక్రమాన్ని తయారుచేస్తారు. కార్యక్రమాలను సాధ్యమైనంతవరకు ఫిర్కా డెవలప్‌మెంటు సహకార సంఘాలద్వారానిర్వహించాలి."

పంతులుగారి కోటి రూపాయల ప్రణాళికలోని విషయాలవల్ల హరిజనాభ్యుయాన్ని వూహించ డాని కద్భుతంగా వుంది.



మాలపల్లెల్లోని పూరిగుడిసెలన్నీ మహాసౌధములుగా మార్చేస్తున్నారంటే ఎవరు హర్షించరు? ఐతే సుమారు 75 లక్షల రూపాయలతో నిర్మించే మేడ మిద్దెలవల్ల అస్పృశ్యుల ఆర్థికజీవితంలో ఏలాంటి అభివృద్ధి కలుగుతుంది? అన్న ప్రశ్న దారిద్ర్య దుఃఖ మనుభవించే పీడిత హృదయాలలో జనించడం సహజమే కదా! అంతే కాకుండా 34 ఫిర్కాల్లోనూ పై కార్యక్రమాలను ఫిర్కా ఆఫీసర్ల హస్తగతం చేయడంవల్ల మరింతఆశ్చర్యాన్ని కల్గిస్తుంది. ఎందుచేతనంటే ఫిర్కా డెవలప్‌మెంటు డిపార్టుమెంటులో ఒక్క హరిజన ఆఫీసరైనా లేకపోయాడు.

ప్రకాశంగారి ప్రణాళిక ఉదారోజ్వలమైనదైనా అది కారణాంతరాలచేత హరిజన నాయకుల సూచనలకు విభిన్నమై విరుద్ధమయింది. ఈసందర్భంలో సుప్రసిద్ధకమ్యూనిష్టు రచయిత రణదివె "స్వాతంత్ర్య పోరాటంలో ఆరుకోట్ల నిమ్నజాతుల స్థానం" అనే వ్యాసంలోని విశేషాలు గమనించవలసివుంది. అందు "అంటరానితనం నివారించడంలో ప్రత్యేక విద్యాసౌకర్యాలు, ఉద్యోగాలలో ప్రాతినిధ్యం నేడు చాలా ముఖ్యపాత్ర వహించాయి. గ్రామాలలో యింకా అంటరానితనం వుండడానికి కారణం నిమ్నజాతులకు భూములు లేవు. స్వతంత్ర జీవనోపాధిలేదు. అందుచేత హిందూ ఉన్నత కులాలవారు విధించిన సంకెళ్ళను తొలగించుకో లేకపోతున్నారు." అని వ్రాసి ఒక పరమ సత్యాన్ని వెల్లడించాడు. ఇది కాంగ్రెసు నాయకులు గమనించాలి. ఆంధ్రలో ఎక్కడ ఏ నిమ్న జాతీయులు మహాసభలు జరపినా ప్రతీసభలోను బంజరు భూముల సేద్యానికి అనుమతించ వలసిందని ప్రభుత్వాన్ని కోరుతూ వుంటారు.

ఉదాహరణకు 3-6-46 న కొవ్వలిలో జరిగిన ఆంధ్రరాష్ట్ర షెడ్యూల్డు జాతుల ప్రథమ మహాసభలోను 23-12-46న కర్నూలులో జరిగిన 14 ఆంధ్రరాష్ట్ర ఆదిమాంధ్ర మహాసభలోను, భూవసతి కల్పించవలసిందని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు. కడపటికి 22-5-46 నాడు శ్రీ బి. యస్. మూర్తి, శ్రీ పి. రామమూర్తి గార్లు ప్రధాని ప్రకాశంగారికి సమర్పించిన మెమోరాండంలో కూడా ఆ పై కోర్కెనే వెల్లడించారు. కాని వాటిని పంతులుగారు పెడచెవినిపెట్టారు. అందువల్ల హరిజన నాయకులకు తీరని ఆశాభంగం కలిగింది. ప్రకాశంగారివంటి సంస్కర్త హరిజనోద్ధారకుడు ఆంధ్రకేసరి చేయ సాహసించని పని మరెవరు చేయగలరు? 75 లక్షల ధనంతో బంజరు భూములు మరమ్మత్తు చేయించి పేద హరిజన హాళికులకిప్రసాదించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడే కార్యక్రమంకన్నా మించిన హరిజనాభ్యుదయం ఎక్కడుంది. కనుక ఉత్తమ హరిజనసేవకులైన నేటి రెవిన్యూ మంత్రి శ్రీ కళా వేంకటరావుగారీ కార్యాచరణకు ముందంజవేసి, అస్పృశ్యుల సమస్య పూర్తిగా పరిష్కరించెదరుగాక!

## మంత్రి కూర్మయ్యగారి హరిజన పౌరహక్కులచట్టం.

అస్పృశ్యుల సాంఘిక చరిత్రలో శ్రీ కూర్మయ్య గారు ఒక నూతన అధ్యాయాన్ని ప్రారంభించారు. ఎన్నోశతాబ్దాల క్రిందట కోల్పోయిన పౌరసత్వపు హక్కుల్ని తిరిగి హరిజనులు పొందడానికి మద్రాసు ప్రభుత్వం ఒకచట్టం నిర్మించడం కడు ప్రశంశనీయమైనది. ఈ చట్టంవల్ల ప్రజల ఉపయోగం కొఱకు ఏర్పడిన నూతులు, చెరువులు, పాఠశాలలు, హోటల్సు, మొదలైనచోట్లకు హరిజనులను రానివ్వని పక్షంలో 6 నెలలు శిక్ష 50 రూ॥లు జరిమానా నిర్ణయమయింది.



శ్రీ కూర్మయ్యగారు బిల్లును ప్రవేశపెడుతూ ఆవేదనతో ఆవేశంతో చేసిన ప్రసంగం యే నిమ్నజాతీయుడు మరువలేడు.

ఇంత జరిగినా పైన తెలిపిన మతగురువులు కూడా పూర్తిగా సంస్కారం తెచ్చిపెట్టలేకపోయారు. కొన్ని ఉన్నత సంఘాలవల్ల హరిజనులు అధోగతియందే యుండిరి. గాంధీ మహాత్ముడును కాంగ్రెస్ పార్టీయు గత 25 సం॥రముల నుండి చేసిన కృషివల్ల శాసనకర్తలుగా హరిజనులిపుడు యీ శాసనం చేయగలుగుచున్నారు. శాసన కర్తలగుటకు అస్పృశ్యులకు హిందూశాస్త్రంలో అర్హత లేదు. కాని నేను నేడు హరిజనుడనై హరిజన అధ్యక్షుడున్న శాసన సభలో శాసనకర్తగా యీ చట్టం చేయగలుగుటకు గర్వించుచున్నాను. 1938 లో ప్రవేశపెట్టిన తొలి చట్టంలో హరిజనులకు పబ్లిక్ స్థలాలు దుకాణాలు మున్నగు వాటిలో ప్రవేశం ఉండాలన్నారే కాని రానివ్వని వారికి శిక్ష విధించలేదు. అందుచే అది ఉపయోగం లేకపోయింది. శాసన సభ్యులగు సాకేటి గురువులుగారికి, యీ వూరులోనూ, బందరులో నాకూ హోటలులో భోజనం నిరాకరించ బడింది. ప్రభుత్వానికి వ్రాస్తే హరిజనులను రానివ్వని హోటలును నిర్బంధించుటకు న్యాయశాస్త్రపు హక్కు లేదన్నారు. అందుచే నేను మంత్రి పదవిలోనికి రాగానే యీచట్టం తలపెట్టాను. ప్రభుత్వంవారు హరిజనోద్ధరణకు యింకనూ ఏమేమి చేయగలరో క్రమేణా తెలియగలదు."

## డా॥ రాజన్‌గారి దేవాలయ ప్రవేశచట్టం.

శ్రీ బి. యస్. మూర్తి గారు దేవాలయ ప్రవేశం గురించి చేసిన తీవ్రమైన ఆందోళనా ఫలితంగా దేశంలో పెక్కు దేవాలయాలు హరిజనులకు తెరవబడ్డాయి. ఆ పిమ్మట డాక్టర్ రాజన్ గారు బిల్లును ప్రవేశపెడ్తూ చేసిన ఉపన్యాసంలో కొన్ని విషయాలు గమనించ తగ్గవి. అందు ".... దేవాలయములలో ఛండాలురు ప్రవేశించరాదని శాస్త్రము నిషేధించుట లేదు. ఏదో ఆచారముగా ఈ నిషేధము బయలుదేరినది. హరిజనులు దేవాలయములో ప్రవేశించి, తమ సోదర మతస్థులతో సమానముగా దైవమును ప్రార్థించుటకు హక్కు యిచ్చుబిల్లును ప్రవేశపెట్టుటకు యెంతయు సంతోషించుచున్నాను.... హరిజనులను దేవాలయములోనికి రానివ్వనిచో, అట్టివారికి శిక్షనుకూడా వేయుటకు యీ బిల్లు అధికారము నిచ్చుచున్నది." హరిజన సోదరులందరూ యీ బిల్లును సక్రమముగా వినియోగించుకుందురు గాక!" అని ఉపన్యసించి తమ విశాల సోదర భావాన్ని వెల్లడించిన వెనుక డా. వి. కె. జాన్. జాన్ గారు బిల్లును బలపర్చారు. పలువురు కౌన్సిలు సభ్యులు అస్పృశ్యతా నిర్మూలనంపై చక్కని అభిప్రాయాలను వెల్లడించారు. ముఖ్యంగా శ్రీ పిఠాపురం యువరాజావారు వెల్లడించిన విషయాలు ప్రతీ హైందవ సోదరునికి అమోఘమైన గుణపాఠాన్ని బోధించాయి. రాజకీయ అవసరంకొద్దీగాక మనోవాక్కాయ కర్మలా అస్పృశ్యతా నివారణకు, హరిజనోద్ధరణకు మనమంతా కృషి చేయాలి. ఇంకా మనం నిమ్నజాతుల్ని అణచి ఉంచితే సాంఘిక విప్లవం రాక తప్పదు. పతిత జాతులకి దేవాలయ ద్వారాలు తెరవడమే కాకుండా పవిత్రమైన హృదయ దేవళాలనుకూడా ఆవిష్కరించాలి." అని శ్రీ యువరాజావారు గంభీరోజ్వలంగా సందేశమిచ్చారు. ఇదే సందర్భంలో సుప్రసిద్ధ ఆంధ్ర పత్రికా సంపాదక మహాశయుడు ప్రభుత్వానికొక విజ్ఞప్తి చేశాడు. అందు "దేవాలయ ప్రవేశార్హతను చేకూర్చిన ప్రభుత్వం హరిజనులకు తగినంత ఆర్థికాభివృద్ధి సదుపాయాలను, తదితర మానవజీవిత సౌకర్యములనుకూడ చూడవలసి వున్నది. అప్పుడే హరిజనోద్ధరణ కార్యక్రమము పూర్తిగానెరవేరినట్లు- మహాత్ముని ఆశయం ఫలించినట్లు" అని వ్రాసి నిమ్నజాతీయుల ఆవేదనను సంపాదకీయంలో ప్రతిబింబింప చేశారు. ప్రభుత్వం సత్వరంగా గమనించవలసిన విధాన మదే!

గత కాంగ్రెస్ ప్రభుత్వం హరిజనులకు చేయ సాహసించలేని సహాయాన్ని శాసనాలనూ, నేటిప్రభుత్వం చేయగలిగిందంటే దేశంలో రాజకీయ చైతన్యంతో పాటు, సాంఘిక పరిణామం కూడా మిక్కుటమౌతూన్నట్టు మనకు గోచరమౌతూంది. దేశసేవ, స్వాతంత్ర్య పోరాటం అనే ఆవేశపూరితమైన ఆదర్శాలకు నిజమైన అర్థం విశాలమైన రాజబాట సుస్పష్టమైంది. అందుచేత కాంగ్రెసీయులు "దేశమును ప్రేమించుమన్న- మంచి యన్నది పెంచుమన్న- వొట్టిమాటలు కట్టిపెట్టోయి- గట్టిమేల్ తలపెట్టవోయ్- దేశమంటే మట్టి కాదోయ్- దేశమంటే ప్రాణులేనోయ్" అను గురజాడకవి సుభాషితాన్ని నిస్సందేహంగా కొంత గ్రహించగలిగినారనుట నిర్వివాదాంశం.

### సమస్యా పరిష్కారం,

ఒక బానిసదేశం పరిష్కరించుకోవలసిన సమస్యలెన్నో వుంటవి. మన దేశంలో మహమ్మదీయుల పాకిస్థాన్ సమస్య స్వదేశ సంస్థానాల సమస్య కార్మిక, కర్షక సమస్యలు, మైనారిటీల

సమస్య, అస్పృశ్యుల సమస్య, మొదలైనవెన్నో ఉన్నవి. అందు ప్రధానమైనది నిమ్నజాతుల సమస్య. ఒకే లక్ష్యసిద్ధికి పలువురు సాధకులు పలుమార్గాలు అవలంబిస్తూండడం సహజం. కాబట్టి నిమ్నజాతుల సమస్యా పరిష్కారానికి మత ప్రవక్తలు సంఘ సంస్కర్తలు, కాంగ్రెసు రాజకీయవేత్తలు, జస్టిసు, పీపిల్సుపార్టీల వారు వారివారి అభిమానాలను పురస్కరించుకొని కొంత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒకప్పుడు క్రైస్తవ మిషనరీలు, మరొకప్పుడు ముసల్మానులు, ఆంగ్లపాలకులు ఎందరో యీ సమస్యను పరిష్కరించబోయారు. అస్పృశ్యతా సమస్య నేటికింకా సశేషమై వుంది. దానికి ప్రధాన కారణం పూర్వం అస్పృశ్యుల సమస్య కేవలం మత సమస్యగానో లేక సంఘ సమస్యగానో భావించి తాత్కాలికంగా ఉద్యమాన్ని నడిపించడమే.

శ్రీ రామానుజాచార్యుల వారి మతోద్యమం నుండి డా॥ రాజన్‌గారి దేవాలయ ప్రవేశ చట్టంవరకూ చరిత్రని పరిశీలిస్తే, మనదేశంలోని అస్పృశ్యుల సమస్య రాజకీయంగా పరిష్కరిస్తే తప్ప వేరొక మార్గాంతరం లేదని గోచరమౌతుంది. అంటే పాకిస్థాన్ లాంటి- బహిష్కృత భారతస్థాన్‌ను ఏర్పాటు చేయమని కాదు. హిందువులతో సంబంధములేని ప్రత్యేక నియోజక వర్గాలను అమలు జరుపమనికాదు. సతీసహగమన నిర్మూలనానికి- బాల్యవివాహాల రద్దుకు- పౌరసత్వహక్కుల రక్షణకూ ప్రభుత్వం చట్టాలు తయారుచేసి- దేశ క్షేమాన్ని కోరినట్టు అస్పృశ్యతా నిర్మూలనానికొక్క చట్టం నిర్మించి, పీడిత ప్రజా రక్షణలకు, హామీ యివ్వవలసి వుంది. నిమ్న జాతులకు అవుసరాలను బట్టి, జనసంఖ్యను బట్టి సరియైన ప్రాతినిధ్యాన్ని కలుగ చేయవలసి వుంది. ఈ విధానమొక్క రాష్ట్ర ప్రభుత్వమందే కాదు



ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వంలో- జరగవలసి వుంది. సంవత్సరానికి కనీసం పది లేక పదిహేను కోట్ల ధనం వెచ్చించి అస్పృశ్యుల ఆర్థిక, విద్యాభి వృద్ధులికి తగుమార్గాలు కల్పించ వుంది. ఇదే పరిష్కారవిధానం కాదు. హైందవ మతాధి పతులు- సంఘ సంస్కర్తలు, రాజకీయవేత్తలు, నిమ్నజాతీయ నాయకులు, మానవాభ్యుదయం కొఱకు, ముఖ్యంగా దేశాభ్యుదయం కొఱకు, తమతమ. హృదయ మేధస్సులను మేళవించి, సుహృద్భావంతో నవ్యాదర్శాలతో 'జాతి ఒక్కటే మానవజాతి' అని ఎలుగెత్తి చాటవలసి వుంది మనుస్మృతి ననుసరించి, బ్రాహ్మణశ్రీలే, అస్పృశ్యతకు కారకులు కాబట్టి, సనాతన ఆర్యసంఘం, వారిపై మోపిన నేరాన్ని నిర్మూలించుకోవడానికొక ప్రతీకార విధానాన్ని అవలంభించాలి. వర్ణాంతర వివాహాలను ఆహ్వానించి, భారతనారీ మణులంతా, అస్పృశ్యతా నిర్మూలనోద్యమంలో ముందంజ వేయాలి. నాడే దేశంలో- జాతి, మత, కుల నిర్మూలనానికి- శాంతి అభ్యుదయాలకూ మార్గ మేర్పడుతుంది. లేదా రాబోవు భారత రాజ్యాంగ పరిషత్ప్రముఖ సభ్యులు, సోవియట్ రష్యాలో, జాతుల సమస్యాపరిష్కారం ఎట్లాజరిగిందీ ఒక్కసారి గమనించవలసి వుంది. దాన్ని ఆదర్శ్యంగా పెట్టుకుని, రాష్ట్ర పరిస్థితుల్నిబట్టి, ప్రభుత్వం, హరిజనాభ్యుదయాని కొనర్చవలసిన సత్వర కార్యక్రమాన్ని, అమలు జరుపవలసి వుంది. లేదా కాలాగుణ్యమైన సాంఘిక విప్లవాన్ని, ప్రేరేపించడానికి, పీడితప్రజాశక్తులన్నీ కేంద్రీకరించబడతవి. అదే నిమ్నజాతుల సమస్యా పరిష్కారానికి ఉత్తమ మార్గమైతే, దానికి బాధ్యులెవరు ? ప్రజాప్రభుత్వమా లేక హైందవ సంఘమా ? అను ప్రశ్నలకు సమాధానం భావి చరిత్రకారుడు నిర్ణయించగలడు కనుక కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం, హరిజనాభ్యు

దయంకొఱకు సవతితల్లి ప్రేమలా కాకుండ, కన్న తల్లిలాగ వెనుక బడ్డవారియెడ ప్రత్యేకాభిమానం చూపవలసివుంది. "ఈ దురోమని మనుషులుంటే దేశమేగతి బాగుపడునోయ్" అను గురుజాడకవి సుభాషితాన్ని గుర్తించుకుని, విశాలదృష్టితో ఈక్రింది కార్యక్రమాన్ని అమలు జరపాలి.

సామరస్యసంఘం.

అనేక కులాలతో, వివిధ సాంప్రదాయాలతో భిన్న భిన్న అభిప్రాయాలతో, సాంఘిక, రాజకీయ వైరుధ్యాలతో, మిళితమైయున్న మనరాష్ట్రంలో ఒండొరులకు మధ్య సామరస్యం కుదిర్చేందుకు ప్రత్యేక కార్యవర్గమొకటి ఏర్పడడం ఎంతేని అత్యవసరం. ముఖ్యంగా నిమ్నజాతుల పురోభివృద్ధికట్టిది వెంటనే ప్రభుత్వం స్థాపించాలి. ఇందు శాసన సభ్యునికి స్థానముండనవసరం లేదు. త్యాగశీలురై, మేధావంతులై, సంఘసేవాపరాయణులైన వార్ని నిమ్నజాతులకు నిజమైన ప్రతినిధుల్నిగా, జిల్లాలవారీగా ప్రభుత్వం ఎన్నుకోవాలి, వారి సహాయ సహకారాలతో హరి జనాభ్యుదయ కార్యక్రమాన్ని కొనసాగించాలి.

నిమ్నజాతుల పేరిట ప్రభుత్వం కోట్లకొలదీ ధనం హెచ్చించ వలసినప్పుడు ప్రజాప్రాతినిధ్యాన్ని సద్వినియోగపర్చేందు కొక ఉత్తమ మార్గం ప్రజాసామ్యం ప్రబలుతూన్న ఈరోజుల్లో- ఏ ఆదిమాంధ్ర సంఘమో, లేక యే హరిజన సేవా సంఘమో, చేసే వినతుల ననుసరించి ప్రభుత్వం పనిచేయ పూనుకుంటే, కొన్ని సంఘాలకు, మరికొన్ని జాతులకు అన్యాయాలు జరుగవచ్చు. ఎందుచేతనంటే ఆదిమాంధ్ర సంఘాల్లో అరుంధతీయులకు- హరిజనసేవాసంఘాల్లో కాంగ్రెసేతర నిమ్నజాతులకు సరియైన ప్రాతినిధ్యంలేదు. కనుక ఎవరే రాజకీయ పార్టీలకు చేరి



156860

వున్నా- సంఘనాయకుల ప్రాతినిధ్యంతో కూడిన ఒక్క పెదకమిటీని ప్రభుత్వం ఏర్పాటుచేసి- మాల, మాదిగ, పాకీ- మొదలైన కులాల్లో సామరస్యం సోదరభావాలు పెంపొందించడానికీ, వారి వారి క్లిష్టపరిస్థితుల్ని నివారించడానికీ ప్రభుత్వం కృషి చేయాలి. ఆలా చేయగలిగితే ఈసామరస్య సంఘం గత సప్రూకమిటీ కంటే ఎక్కువ ప్రయోజనకారి ఔతుంది. హరిజనాభ్యుదయానికి మార్గదర్శక మౌతుంది.

హరిజన మహిళ.

ఊరి కామడదూరంలో వున్న పూరిగుడిసెల్లో, అనాగరికులై- అనారోగ్యవంతులై- అవిద్యతో- అజ్ఞానంతో మూర్తీభవించిన దారిద్ర్య దేవతల్లా హరిజన మహిళలు సామాన్యంగా ప్రత్యక్ష మౌతూంటారు.

వొంచిన నడుం ఎత్తకుండా ఉదయం మొదలు సాయంత్రం వరకూ కష్టించినా కడుపునిండా తిండిలేదు. ఒంటి నిండా బట్టలేదు హరిజనస్త్రీలకు! రాష్ట్రంలో బహు కొద్దిమంది యువతులు స్కూలు ఫైనల్ పరీక్షవరకూ విద్యనభ్యసించి, తగినంత ప్రోత్సాహం- సౌకర్యాలులేక కొందరు ఉపాధ్యాయినిలుగా రాయల్ నర్సులుగా జీవితంలో ప్రవేశించారు. మరికొందరు క్రైస్తవ మిషనరీలిచ్చే సహాయాలకూ- ఉద్యోగాలకు ఆశించి, మతాంతరులై పోతూన్నారు. ఈదుస్థితికి మూలకారకులెవరు? హైందవ సంఘమా? లేక ప్రజాప్రభుత్వమా? మన రాష్ట్రంలో మహిళాసంఘాలు హరిజనస్త్రీల అభ్యుదయానికి తోడ్పడకపోవడం శోచనీయం. దానితో ప్రభుత్వం కూడా నిర్లక్ష్యంగా, హరిజన స్త్రీల సమస్యను తోసిపుచ్చడం మరింత శోచనీయం! 'కీడెరిగి

రక్షవేయాలి' అన్నట్లు, హరిజనాభ్యుదయమనే దివ్యసౌధమం నిర్మించాలంటే- హరిజనస్త్రీల హృదయ క్షేత్రంనుండి పునాదులు తీయాలి. విత్తునుబట్టి మొలక- గ్రుడ్డును బట్టి పిల్ల!! బహిర్గత మౌతుంది కదా! అందుచేత హరిజన స్త్రీల కార్యక్రమాన్ని అమలు పర్చడంలో ప్రభుత్వం- ఎంతో ఉదార స్వభావాన్నిచూపి, ఆంగ్లభాషా వ్యామోహాన్ని విడనాడి- కనీసపు విద్యార్హతుల్ని బట్టి స్త్రీలకు ఉన్నతోద్యోగాలు కలుగజేయవలసి వుంది.

I. Women welfare officers :-

జిల్లా తాలూకాలవారిగా, హరిజనస్త్రీల క్షేమాన్ని గుర్తించే ఉద్యోగుల్ని నియమించి, వారిక్రింది విధ్యుక్త ధర్మాలను పాటించే టట్టు ప్రభుత్వం చూడాలి.

i. మాలపల్లెలో ప్రసూతి, వైద్య- ఆరోగ్య పరిస్థితుల్ని గమనించి, తగు సదుపాయాలకై తోడ్పడం.

ii. నూలు వడకుట- కుట్టు- లేసు. ఆటవస్తువులు, బొమ్మలు తయారుచేయుట మొదలైన చేతి పరిశ్రమలు వృద్ధి చేయడం.

iii. బాలికా వసతి గృహాలు దర్శించి, హరిజన బాలికల, విద్యాభివృద్ధికి, సమస్త సౌకర్యాలు, హెచ్చించడం.

iv. హరిజనస్త్రీ కూలీలకు నియమితమైన పని గంటలు- మంచి జీతాలు యేర్పాటు చేయించడం.

2. ప్రభుత్వ శాఖ

రాష్ట్రప్రభుత్వంలో ఎందరో పట్టభద్రులు వివిధ శాఖల్లో ఉద్యోగాలు చేస్తున్నా, వారిలో నూటికొక్కరు గజిటెడ్ ఆఫీసరు



పదవినైనా అలంకరించభేదంటే ప్రభుత్వం, నిమ్నజాతీయులెడ ఎంత ఉదాసీనతతో వర్తిస్తున్నదీ తెలియగలదు.

సర్వీసును బట్టిగాని- మెరిట్ ను బట్టిగాని ప్రమోషన్ను ఉన్నవా అంటే- హరిజన నాన్ గజిటెడ్ ఆఫీసర్ను విషయాల్లో జరిగిన అన్యాయాలు ఇన్నిన్ని కావు.

సవర్ణాధికారులు కులాభిమానులై- స్వార్థపరులై లంచ గొండులై హరిజనోద్యోగులను అణచి- వారికి ప్రమోషన్ను లేకుండా-చేసిన సంఘటనలెన్నో ఉన్నవి. ఒక్క డిపార్టుమెంటులో కాదు-ముఖ్యంగా పోలీసు, రెవిన్యూ- ఎడ్యుకేషనల్- పి. డబ్ల్యు- పేపరు కంట్రోలింగ్- డిపార్టుమెంటుల్లో జరిగిన అక్రమాలు- వివ రించాలంటే బైబులంత గ్రంథం ప్రచురించవచ్చు. ఇవి, ఎడ్వయి జర్ల ప్రభుత్వంలోనే కాదు- కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం రాజ్యమేలు తూన్న ఈ రోజుల్లో కూడా నిర్భయంగా- బాహాటంగా జరుగుతూ న్నవి. అందుచేతనే- పేటికాంతర్గతమైన రత్నాల రీతిగా, తమ సహజప్రతిభావిశేషాలకు స్వస్తి జెప్పుకుని, గుమస్తాలుగానే, ఉద్యో గాల్లో ప్రవేశించి, గుమస్తాలుగానే విరమిస్తున్నారు. పాపం! హరి జన ఉద్యోగస్థులు! వారి ఇక్కట్లు తొలగించడానికి ప్రభుత్వం ఈక్రింది సూచనలు గమనించాలి.

I. Director for Harijan uplift :-

హరిజనాభ్యుదయ మంత్రికి సహాయకుడుగా కార్యక్రమం నిర్వహించేందుకు ఒక డైరక్టరును నియమించాలి. అతడు హరి జనుడై, మంచి మేధావంతుడై, త్యాగశీలుడై ఉండాలి. అతని క్రింద జిల్లా, తాలూకా ఆఫీసర్లు- నాన్ గజిటెడ్ హోదాల్లో నియ మించబడాలి. వారి క్రింది విధ్యుక్త ధర్మాలను పాలించాలి.

1. ప్రాథమిక నిర్బంధోచిత విద్యా సౌకర్యాలు చూడాలి.

2. పౌరసత్వ- దేవాలయ చట్టాలు సద్వినియోగ పడేటట్టు గమనిస్తూండడం.

3. వసతి సౌకర్యాలు- మంచినీటి సదుపాయాలు పరిశీలించడం.

4. సరియైన జనాభాను తీసి- ప్రజాప్రాతినిధ్యానికి మంచి త్రోవ చూపడం.

5. బంజరుభూముల సేద్యానికి- వ్యవసాయ కూలీల ఋణాలు తీర్చేందుకు సహకార సదుపాయాలు లభింపజేయడం.

II. కమ్యూనల్. జి. ఓ. ఇంకా 5 సం॥రాలు పొడిగించి దాని ప్రయోజనం ఎక్కువ హరిజనాభ్యుదయానికి కలిగేటట్టు చూడాలి.

ప్రభుత్వ డిపార్టుమెంటుల్లో సీనియారటీ పద్ధతి నిమ్న జాతులకు రద్దుచేసి, ప్రొబేషనరీకాలం పూర్తికాగానే ప్రమోషన్ యిచ్చేటట్టు ప్రభుత్వం అంగీకరించాలి.

III స్థానిక సంస్థల్లో కనీసం 6 స్థానాలైనా నిమ్నజాతులికి ప్రత్యేకించి. అధ్యక్ష పదవులు కులాల వారీగా అవకాశం లభించేటట్టు ప్రభుత్వం ఏర్పాటుచేయాలి.

IV. గ్రామాల్లో మునసబు- కర్ణాల ఉద్యోగాలు వంశ పారంపర్యంగా ఇచ్చే పద్ధతి రద్దుచేసి, సమర్థులైన హరిజన విద్యావంతులకా పదవులు లభించేటట్టు ప్రభుత్వం వెంటనే శ్రద్ధ తీసుకోవాలి.

3. విద్యాశాఖ.

"విద్యావిహీనః పశుః" అనే ఆర్యోక్తి హరిజనుల్లో పూర్తిగా వర్తిస్తుంది. శూద్రుడు వేదం చదివినా, విన్నా వాడి నాలుక కోసి-చెవుల్లో సీసం కాచి పోయాలనే సిద్ధాంతం చెలామణి



యైన రోజులునుండీ నిమ్నజాతులకు విద్య, విజ్ఞానాలు సూన్యమైనాయి. నేటి విద్యా వివరాల్ని బట్టి పరికిస్తే 100 కి 99 మంది హరిజనులు నిశానీ దారులుగా ఉన్నారు. ఇది ఆంగ్ల ప్రభుత్వానికెంతో లజ్జాకరమైన విషయం.

నేడు దేశంలో స్థానిక సంస్థల ప్రాథమిక పాఠశాలలు మిషనరీ పాఠశాలలు, లేబరు పాఠశాలలు, విద్యాపోషకుల ప్రయివేటు పాఠశాలలు. హరిజన సేవాసంఘం వారి పాఠశాలలు, నిమ్నజాతులకు విద్యాసౌకర్యాలు కలుగ జేస్తున్నవన్నమాట వాస్తవమే కావచ్చు కాని, సవర్ణ హిందూ విద్యార్థులు పొందే సుఖాన్ని హరిజన విద్యార్థులు పొందలేక పోతున్నారన్న నగ్న సత్యాన్ని వెల్లడించవలసివస్తే ప్రాథమిక పాఠశాలల్లో హరిజన విద్యార్థులకు అంగవస్త్రాలే ఉండవు. ఆకలి మంటలతో, బక్కచిక్కిన శరీరాలతో, రోగగ్రస్తులై పాఠశాలలకు హాజరౌతారు!

విజ్ఞానానికి, సంస్కృతికీ పుట్టిల్లైనది విద్యయన్న సంగతి ప్రభుత్వం గుర్తిస్తే అస్పృశ్యత ఏనాడో నిర్మూలమై వుండేది. సదవకాశాలు! మంచిపరిసరం! చక్కని వాతావరణం! మొదలైన వాటిని ప్రభుత్వం నిమ్నజాతులకు కలుగజేయాలి. ఈనాడు భారత తాత్కాలిక ప్రభుత్వంలో కార్మిక శాఖకు శ్రీజగజ్జీవనరాం న్యాయ శాఖకు- శ్రీమండలె గార్లు సభ్యులుగా ఉన్నా-లేక మద్రాసు రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రిగా శ్రీ కూర్మయ్యగారు పౌరసత్వపు చట్టం చేయగలిగినా- ముఖ్యకారణం వారి విద్యా రాజకీయ పరిజ్ఞానాలే కారణాలు కదా! అందుచేత ప్రభుత్వం 'It is better to educate once child than to give gold in charity' భిక్షగా బంగారం దానం చేసే దానికంటే, ఏ ఒక్కరికైనా విద్యా

భిక్ష పెట్టడం ఉత్తమోత్తమం అన్న మహమ్మదు సుభాషితాన్ని మరువకూడదు. హరిజనాభ్యుదయ కార్యక్రమంలో విద్యాప్రచారాని కీ క్రింది సూచనలు గమనించాలి :—

1. వయోజన విద్యాప్రచార కేంద్రాలను వృద్ధిచేయాలి. రాత్రి పాఠశాలలను ప్రభుత్వం ఆమోదించి, వాటికి ప్రత్యేక సదుపాయాలు అనుగ్రహించాలి.

2. జిల్లాకొక మిడిల్ స్కూలు హరిజనులను ప్రత్యేకంగా నిర్మించి, వాటి కనుబంధముగా, ఉచిత భోజనవసతి గృహాలు ఏర్పాటు చేయాలి.

3. ప్రతీ మాలపల్లెలోనూ నిర్బంధోచిత విద్య ప్రవేశపెట్టి బిడ్డల పాలికాపుతనాలపై ఆధారపడే, నిర్భాగ్యపు తలిదండ్రులికి కొంత బోనసులు సమకూర్చాలి లేదా- ప్రాథమిక విద్యార్థులకు కూడా విద్యార్థివేతనాలు ఎక్కువచేయాలి.

4. కళాశాలల్లో, విద్య నభ్యసించే ప్రతీ హరిజన విద్యార్థికీ ఎక్కువ విద్యార్థి వేతనాలు సకాలంలో లభించేటట్టు చూడాలి.

5. విదేశవిద్యలకు విద్యార్థుల్ని ఎన్నుకునే టప్పుడు, హరిజనుల్ని జిల్లావారీగా సెలక్టు చేసుకోవాలి.

6. మెడిసిన్- ఇంజనీరింగ్- అగ్రికల్చరల్- లా- మొదలైన కళాశాలల్లో హరిజన విద్యార్థులికి నియమబద్ధం లేకుండా స్థానాలు ప్రత్యేకించాలి.

## 4. వ్యవసాయ కూలీలు.

మన రాష్ట్రంలో నూటికి 90 మంది హరిజనులు వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారు. వీరికి జరిగే ఘోర అన్యాయాలు ఏన్యాయస్థానాల్లోనూ వినిఉండం. వీరనుభవించే కఠోర దారిద్ర్య



ఏసవర్ణ హైందవుడూ వూహించనేలేడు. వీరనుభవించే దుర్భర దుఃఖజీవితం ఏభారతీయకవీ వర్ణించనేలేదు. దేశానికి రైతు గుండె కాయవంటివాడు. రైతుకు వెన్నెముక వంటివాడు పాలికాపు! అతడే వ్యవసాయకూలీ- అస్పృశ్యుడు!! అప్పుల కొంపలో, గంపెడు సంతానంతో, తిండీ, బట్టా లేక వ్యవసాయ కూలీలు అల్లల్లాడుతూన్నారంటే అతిశయోక్తి ఎంతమాత్రం కాదు. అందుచేత వారి ఆదాయం, వారి సౌఖ్యం- వారి సౌష్టవం వృద్ధి పొందించాలి వారి పురోభివృద్ధికీక్రింది సూచనలు తప్పక గమనించాలి.

1. బంజరు భూములు మరామత్తు చేయించి, సేద్యానికై పేద కూలీలకు పట్టాలతో సహాయిప్పించడం.

2. నియమితమైన పని గంటలు మంచి జీతాలు నిర్ణయించడం.

3. విశ్రాంతి, వినోదాల సదుపాయాలు ఎక్కువ కల్పించి, రేడియో గ్రామస్థుల కార్యక్రమాలు, మాలపల్లెల్లోని కూలీ జనానికి ఎక్కువ తోడ్పడేటట్టు గమనించాలి.

4. తిండి, బట్ట, సరఫరా డిపోలు, పెట్టుబడిదార్ల హస్తగతం చేయకుండా, వ్యవసాయకూలీ నాయకులకే లైసెన్సులిప్పించి, ప్రజలకెక్కువ న్యాయం జరిగేటట్టు చూడాలి.

5. గోదావరీ లంకల్లో సెటలు మెంటు రిజర్వులు, కనీసపు దామాషారేటుకు నిమ్నజాతీయులకు శాశ్వతపు జిరాయితీలుగా యిప్పించాలి.

6. గ్రామ సంఘాల్లోనూ, స్థానిక సంస్థల్లోనూ, కూలీలకు తగినంత పాతినిధ్యం కలుగజేయాలి.

5. కుటీర పరిశ్రమలు.

ఇపుడు దేశంలో ప్రతీవారూ పరిశ్రమల అభివృద్ధినిమిత్తం, కలవరిస్తూన్నారు. ఇట్టి పరిస్థితుల్లో ముఖ్యంగా రెక్కాడితేనే గాని డొక్కాడదనే నిజాయితీని వెల్లడించే హరిజనులికి కుటీర పరిశ్రమలు నేర్పించడం అత్యావసరం. పెక్కు గ్రామాల్లో ప్రజలు సంవత్సరానికి 6 మాసాలు మాత్రమే కూలో, నాలో చేసుకుని మిగిల్న రోజుల్లో నిరుద్యోగులై, నిరాహారులై క్రుంగి కృశిస్తున్నారు. అందుచేత స్వయం పోషకమైన కొన్ని గృహ పరిశ్రమల్ని మాల మాదిగ పల్లెల్లో, స్త్రీ పురుషులికి నేర్పించే సందర్భాల్లో ఈ క్రిందివాటికి ప్రాధాన్యమివ్వాలి. (1) వడ్రంపని (2) నేత (3) చర్మశుద్ధి-జోళ్ళపరిశ్రమ (4) కాగితం (5) సబ్బులు (6) దంపుడు బియ్యం (7) ప్రాంతీయప్రముఖ పరిశ్రమలు.

6. సహకార సంఘం.

"నన్ను ముట్టుకోకు నామాల కాకి" అనే సంకుచిత దృష్టితో స్వార్థ కాంక్షలతో జీవించే యుగంనుండి దాటి సామాజిక శక్తుల్ని బల పర్చుకుని, దేశ సౌభాగ్యాన్ని కోరే విశాల భావ ప్రపంచానికి మానవులు చేరుకుంటూన్న రోజులివి. ఈమహోత్కృష్ట ధర్మాన్ని వివిధ రూపాల్లో నిర్వర్తించ డానికే మనదేశంలో సహకారసంఘాలు నెలకొల్పబడ్డాయి. కాని అవి సామాన్య ప్రజానీకానికి తోడ్పడలేక పోతూన్నవి. యుద్ధానంతరాన్ని మూల మూలలికీ ఎగబ్రాకిపోయిన బ్లాకుమార్కెట్టుకూ, తిండి, బట్టల కరువులకూ తీవ్రంగా గురియైపోయిన నిమ్నజాతులకు సహకార సంఘాలు తోడ్పడలేక పోయాయి. ముఖ్యంగా Rural credit సొసైటీలు urban banks, primary Co', సొసైటీలు, F. L. సొసైటీలు, Better living సొసైటీలు,గాని తుదకు producers' and consumers' సొసైటీలుగాని, నిర్వర్తింప వలసినంత విద్యుక్త ధర్మాన్ని నెరవేర్చుకోలేకపోయేయి. కొన్నిచోట్ల నిమ్న జాతుల సభ్యత్వాన్ని సొసైటీల జన్మహక్కులే నిరసించారు. కనుక, ప్రభుత్వం పై సొసైటీలు నిమ్నజాతులకు ఎక్కువ ఉపకరించేటట్టు చేయడానికి ప్రభుత్వం సహకార సంఘాల్లో కొన్ని నవీనమైన ఆదర్శాలు చేర్చాలి. పెట్టుబడుదారుల యొక్క పై ఉద్యోగస్థుల యొక్క నిరంకుశత్వాలనుండి సంఘాల్ని దూరం చేయాలి. నిమ్నజాతుల శ్రేయానికై ప్రభుత్వ మీక్రింది సూచనల్ని గమనించాలి.



1. ఆహారం, వస్త్రం, విత్తనాలు, వ్యవసాయపు పనిముట్లు కంట్రోలు ధరలకు సరఫరా చేయించేందుకు గ్రామ సహకార సంఘాలు నెలకొల్పడం;

2. మాలపల్లెలను, నవీన పద్ధతుల్లో పునర్నిర్మించడం వాటి అవసర నిమిత్తం- ఋణ విముక్తికొఅకు తాత్కాలికంగా వడ్డీలేని పెట్టుబడిని పెట్టడం;

3. హరిజన కోపరేటీవు ఇన్స్పెక్టర్లును ఎక్కువచేసి, వారి ప్రచారం ద్వారా సహకార సంఘజీవిత సుఖాన్ని, నిమ్న జాతులు ఎక్కువ అనుభవించేటట్టు చేయాలి.

7. ప్రచురణ శాఖ.

తర తరాలనుండీ ఆర్థికంగా, సాంఘికంగా, రాజకీయంగా అధః పతితులై పోయిన నిమ్నజాతీయుల్లో అవిద్య, అజ్ఞానం, మూర్ఖత్వాలు, హిమాలయాల్లాగ ఘనీభవించుక పోయాయి.

అవి పూర్తిగా నిర్మూలించడానికి, ప్రభుత్వంగాని, ప్రజలు గాని ఎంత కృషిచేసినా, వారితోపాటు, నిమ్నజాతీయులు కూడా, 'ఎవరి కాళ్ల మీద వారు నిలబడాలి' అన్నట్లు వ్యక్తిగతంగా, అభి

వృద్ధి పొందడానికి తీవ్రంగా కృషిచేయాలి. అందుచేత వారిలో రాజకీయ విజ్ఞానం, సాంఘిక చైతన్యం, కళాసంస్కృతులు వర్ధిల్లడానికి, దివ్యప్రబోధాన్ని విన్పిండానికి, ప్రభుత్వ మీక్రింది సూచనలు గమనించాలి.

అచ్చు యంత్రం.

ప్రపంచంలో ఏ ఉద్యమాన్నిగాని, యే సంస్థనుగాని మనం పరికిస్తే, వాటన్నిటికీ, అండగా ఉండి, ప్రజా శక్తుల్ని కూడ గట్టి, నూనసిక విప్లవానికి దోహదమిచ్చేది ఒకేఒక అచ్చుయంత్ర మన్న విషయం మనకు గోచరమౌతుంది. దీన్ని ప్రభుత్వం, సమకూర్చగలిగితే పీడిత ప్రజలకొక కామధేనువును అను గ్రహించిన వారౌతారు. దాని మూలంగా ముఖ్యంగా, 1 పత్రికలు, కరపత్రాలు, గ్రంధాలు ప్రచురించి, తగ్గువ ధరలకు ప్రజానీకాని కందించవచ్చు.

2. హరిజన యువకుల్లో కొందర్ని జర్నలిష్టుగాను మరి కొంత మందిని కంపోజిటర్సుగాను, పుస్తక వ్యాపారస్థుల గానూ తయారుచేసి, వారి ఆర్థికాభివృద్ధికి, తద్వారా హరిజనాభ్యుదయా నికి తోడ్పడవచ్చును.

ప్రచారకవర్గం.

"లోకోభిన్నరుచిః" అన్నట్లు సంఘంలో అనేక తరహాల వ్యక్తులున్నారు. నిమ్న జాతీయుల్లో రాజకీయ చైతన్యం ప్రారంభ మైన మరు క్షణం నుండీ, బహు నాయకత్వం ప్రబలమైపోయింది. ముఖ్యంగా ఆంధ్రలో షెడ్యూల్డు జాతుల ఫెడరేషన్- కమ్యూ నిష్టుపార్టీ (వ్యవసాయకూలీ సంఘం) కాంగ్రెస్- సంస్థల యాజ మాన్యాన్ని ప్రజలు నడుస్తున్నారు. ఆయాసంస్థల నాయకులు పదవీ వ్యామోహాలై, స్వార్ధపరులై, పార్టీ కక్షలతో పవిత్రమైన



ఆదర్శాలకు దూరస్థులైన కారణాలవల్ల ఈ ఉద్యమాలు ప్రజల్ని అభ్యుదయం వైపుకో లేక అంధకూపం వైపుకో? ఏ వైపుకు నడిపించనున్నవీ నిర్ణయించ లేని పరిస్థితులేర్పడ్డవి. అందుచేత నిమ్న జాతీయుల్లో- రాజకీయ విభేదాలెట్లున్నప్పటికినీ, ప్రభుత్వానికీ, ప్రజలకీ మధ్య సామరస్యం. యేర్పర్చడానికి, సోదర భావం- దేశసేవ ప్రజల్లో రేకెత్తింపజేయడానికి సమర్థులైన వ్యక్తుల్ని జిల్లా, తాలూకాల వారిగా ప్రచారకుల్ని ప్రభుత్వం సమాచార శాఖకు అనుబంధంగా నియమించి వారీ క్రింది విషయాలు గమ నించేటట్లు చూడాలి.

1. అశ్పృశ్యతా నిర్మూలనం-సంఘ సంస్కరణం. వృద్ధి పొందిస్తూ వివిధ జాతుల మధ్య సామరస్యం, సంఘీభావం అలవర్చాలి.

2. హరిజనాభ్యుదయ కార్యక్రమాలకు ప్రజలనుండికూడా విధిగా చందాలు వసూలుచేసి హరిజన వెల్‌ఫేర్ ఆఫీసర్లకు అంద జేయాలి.

3. జూదం, మద్యపానం, మొదలైన దురభ్యాసాల నిర్మూలనానికి, మేజిక్ లాంత్రెను, వినోద ప్రదర్శనాల ద్వారా ప్రజల్లో సదాచారాలు ప్రచారం చేయడం.

కళాపరిషత్తు

ఒక దేశం యొక్కగాని, జాతియొక్కగాని ఔన్నత్యాన్నీ- నాగరికతనూ, విజ్ఞానాన్నీ, కొలిచి నిర్ణయించేది ఒక్క కళా కౌశల్యమే అన్న విషయం జ్ఞానసంపన్నులెవరూ మరువరు. నిమ్నజాతీయుల్లో నాట్యకళాప్రపూర్ణులు. గాయక శిఖామణులు, ప్రసిద్ధ చిత్రకారులు, మహావక్తలు, అభ్యుదయ రచయితలు అనుబంధంలో పేరొ్కనబడి నట్టివారెందరో అభివృద్ధి పొందు తూన్నారు. అట్టివార్ని ప్రోత్సహించి, రాష్ట్రంలోఒక అదిహైందవ

కళాపరిషత్తును ఏర్పాటుచేసి ప్రభుత్వం పోషించాలి. ఆకళాపరిషత్తు ఈ క్రింది కార్యక్రమాన్ని పరిశీలిస్తుంది.

1. సంఘాభ్యుదయానికి నాటకాలు, బుర్రకథలు, వ్యాసాలు గ్రంథాలు- రచించి, ఉత్తమ తరగతికి చెందిన వాటికి బహుమతులు- రచయితలకు పదవులు నిర్ణయించడం.

2. ఏడాదికొక సారి "హరిజనాభ్యుదయ దినోత్సవం" జరిపి హరిజన మేధావంతుల్ని- ప్రసిద్ధ పురుషుల్ని సన్మానించి, తద్వారా జాతీయుల్లో నూతనోత్సాహం రేకెత్తించడం.

3. నాట్యకళామండలి నొకదాన్ని నిర్వహిస్తూ, "హరిజనాభ్యుదయ" కార్యక్రమానికి ఎక్కువ విధిని సమకూర్చడం.

4. వాగ్వాద సంఘాలు- వైజ్ఞానిక దళాలు- రచయితల సంఘాలు జిల్లాల వారీగా స్థాపించి, తద్వారా దేశ పురోభివృద్ధికీ, అస్పృశ్యతా నిర్మూలనానికీ కృషిచేయడం.

—: వాలంటీరు దళం :—

మన దేశంలో మత వ్యామోహత- కులాభిమానం- ధనిక వర్గ నిరంకుశత్వం రాజ్యమేలుతూన్నంత కాలం రాజకీయ- సాంఘిక, వర్గ కలహాలు తటస్థిస్తూనే ఉంటవి. ముఖ్యంగా, నేటికింకా అస్పృశ్యులుగా తృణీకరించ బడుతూన్న హరిజనులు దేశ సేవకులుగా, ప్రజారక్షకులుగా పేరొందినారు. అట్టివారి సంతతికి చెందిన యువకుల్ని మేళవించి రాబోవు స్వతంత్ర్య ప్రజాప్రభుత్వంలో దేశశాంతి రక్షణలు నిల్పేందుకు హరిజన యువకుల్ని ముందు స్వచ్ఛంద సేవకుల్నిగా తయారు చేయాలి. నేటి యువకులే రేపటి పౌరులన్న విషయం దృష్టిలో పెట్టుకుని నిమ్న జాతీయ యువకుల శరీరక, మానసిక శక్తుల్ని అభివృద్ధిపరచాలి. అందుకే క్రింది సూచనలు పర్యాలోకించాలి.



1. గత యుద్ధంలో పనిచేసి, నేడు నిరుద్యోగులుగా ఉన్న వారితో కూడిన వాలంటీరు దళం నిర్మించి, వారికి గ్రామాల్లో, పోలీసు అధికారాలు కొన్ని గలుగజేయాలి.

2. ప్రథమ చికిత్సా వైద్యం, బేండు వాయుద్యశిక్షణం అగ్నిప్రమాద నిర్మూలనా శిక్షణం మొదలైనవి నేర్పించి, గ్రామాభ్యుదయ శాంతి రక్షణలు కాపాడాలి.

3. ఆటలు- కర్రసాము- కుస్తీలు మొదలైన వాటిని శాస్త్రీయ పద్ధతుల్లో నేర్పించి, వ్యాయామము పోటీల ద్వారా సహనం, సద్భావం, సేవాదక్షతవృద్ధి చేయాలి.

4. వీరు హరిజన సభల్లోనే కాకుండ, మహాసభల్లో పోలీసు సహాయ మపేక్షించ కుండా క్రమశిక్షణ, నిలుపగలగాలి.

రాజకీయ వేత్తలకు విజ్ఞప్తి!

ఈ చిన్న గ్రంథాన్ని- కూప్ లాండ్సు ప్రణాళికగా క్రిప్సు సూచనలుగా లేక జిన్నాసాహేబు ప్రతిపాదనలుగా భావించి, ఎక్కువ ప్రాధాన్యత నిచ్చి, పఠించవలసినదిగా ప్రార్థన. నేవ్యక్త పర్చలేని విషయాలు మీరూహించి, అస్పృశ్యుల సమస్యను పరిష్కరించడానికి మీరాజకీయ పరిజ్ఞానాన్ని ఉపయోగించవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ గ్రంథాన్ని ఆమూలాగ్రంగా పఠించి, ముందు ప్రణాళికలో సూచించినట్లు, నిమ్నజాతులకు ఉన్నతోద్యోగాలు- రాజకీయాధికారాలు ఎక్కువ సమకూర్చినంత మాత్రాన అస్పృశ్యత నిర్మూలన మౌతుందా అని సంశయించకండి. దానికి సమాధానంగా "ఔను- కాదు" అని నుడువవలసి వస్తుంది. దానికి కారణం నేడు ప్రభుత్వంలో మంత్రిగా అత్యున్నతపదవులు అలంకరించినా, శ్రీ కూర్మయ్యగారు గాని- శ్రీ మునిస్వామి పిళ్లే గారు గాని అస్పృశ్యులుగానే ఎంచబడుతూన్నారు. ఐతే వారు

అస్పృశ్యతయొక్క ఒత్తిడినుండి దూరమయ్యారు కదా!- అందువల్ల, ఉన్నతోద్యోగాలవల్లా, రాజకీయాధికారాలవల్లా, అస్పృశ్యత కొంత నిర్మూలన మైనా, మరికొంత సవర్ణ హిందువుల హృదయ పరివర్తనవల్ల పూర్తిగా నిర్మూలనం కాగలదు. ఆ హృదయ పరివర్తన ఎన్నాళ్లకు లభిస్తుందో ఎవరు జోస్యం చెప్పగలరు? అన్నాళ్లూ అస్పృశ్యులు సహించి, స్వతంత్ర భారత రాజ్యాంగంలో కూడా జీవించ గలరా? దుర్భరం! దుస్సాధ్యం!! కారణం "సంఘ సమానత్వం" అనే ఉజ్వల ధర్మం- ఒక ప్రక్క ప్రపంచాన్ని ఆవరిస్తుంది. అది అంతఃకలహాలతో- సాంఘిక- రాజకీయ సంఘర్షణలతో మనదేశంలో ప్రారంభ మయ్యింది. కాని మన దేశ సాంఘిక కలహాలకు మూలకారణం ఆర్థిక, మత సంబంధాలనుండి దాటి పోయింది. అసలు పీకులాట రాబోవు నూత్న రాజ్యాంగంలో, రాజ్యాధి కారాల్లో వాటాలు పంచుకోవడం దగ్గరకు వచ్చింది! ఇది హిందూ ముస్లింల నుండి బ్రాహ్మణ, బ్రాహ్మణేతర పార్టీలనుండి, అస్పృశ్యుల సమస్యా పరిష్కారం వరకూ వ్యాపితమయింది. అందుచేత దేశంలో రాజకీయ వేత్తలు గమనించవలసింది ఒక్కటే- దేశంలో ముసల్మానులు, క్రైస్తవులు, శ్రీ మండల్ ప్రభుత్వహోదాలు, సమాజంమీద దాడి చేస్తూ హిందూ మతస్థులై అస్పృశ్యులుగా నిరసించబడే వార్ని మతాంతరుల్ని చేయొచ్చు. అపుడు హిందూసమాజం ఎంత బలహీన పర్చబడుతుందో వేరుగా వివరించ నక్కర్లేదు. అందువల్లనే హరిజన సమస్య అతిప్రస్తుతమై- అతి ప్రాముఖ్య మయ్యింది. ఈ సందర్భంలో లోకపూజ్యుడైన మహాత్ముడు హృదయావేదనతో వెల్లడించిన ప్రవచనం ప్రతీ భారతీయుడూ తమ తమ గుండెల్లో



చిత్రించికోవలసి ఉంది. "నిమ్నజాతీయులు హిందువులే- అంటరాని తనమనే నేరాన్ని అనుసరిస్తున్నంత కాలం భారత ప్రజలకు స్వరాజ్యాన్ని పొందగోరే నైతిక హక్కులేదు." అనే గాంధీజీ సుభాషితం కాంగ్రెస్ ప్రభుత్వ సభ్యుల దేశభక్తిని పరీక్షిస్తుంది గదా! అందుచేత, ఎన్నో క్రొత్త స్కీములు రాష్ట్రంలో అమలు జరిపిన కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం- హరిజనాభ్యుదయానికి సత్వరంగా నిర్వహింపవలసిన కార్యక్రమం- ఆదర్శప్రాయంగా ప్రజాఆకర్షనీయంగా- తీర్చిదిద్దాలి. ఆలా జరగన్నాడు- నేటి ఆందోళనాయుగంలో రాజకీయ చైతన్యవంతులైన నిమ్నజాతీయులు ప్రతీకారంగా, ఏవిధానం అవలంబిస్తారో దురూహ్యం!

"మేము భారత స్వాతంత్ర్యానికి వ్యతిరేకులం కాదు మాహక్కుల రక్షించుతామనే గ్యారంటీ మాకు కావాలి" అని నిమ్నజాతుల సమాఖ్యాసభ్యులు, కాంగ్రెసుపై, పదేపదే సవాలు చేస్తున్నారు. అట్టి పరిస్థితుల్లో ప్రభుత్వం నిమ్నజాతులయెడ తన కర్తవ్యాన్ని వెనువెంటనే నెరవేర్చవలసి వుంది కదా! ప్రభుత్వం తన ప్రజలికి రక్షణ, శాంతి, అభ్యుదయాలు కల్పించడానికి అభయం ఇవ్వకపోతే ఆ ప్రభుత్వం, నిరర్థకమౌతుంది కదా- అన్నదే మన రాష్ట్ర రాజకీయవేత్తలకు విజ్ఞప్తి!

### హరిజన అసంబ్లీ సభ్యుల కర్తవ్యం!

ఒక ప్రభుత్వాన్ని నిర్మించడానికీ- నిర్మూలించడానికీ కూడా ప్రజా ప్రతినిధులైన శాసనసభ్యులు శక్తివంతులై ఉన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో అస్పృశ్యులకు ప్రతినిధులుగా ఎన్నుకోబడ్డ వారు స్వజాతీయుల జన్మహక్కుల్ని రక్షించుకునే శక్తివంతులై ఉన్నారు. అమాయకులైన సోదరప్రజానీకాన్ని దారిద్ర్య దుఃఖ, దాస్యశృంఖలాలనుండి విముక్తుల్నిచేయ బాధ్యులై ఉన్నారు. తమ

జాతి అభ్యుదయకార్యక్రమాన్ని ప్రభుత్వం ఆమోదించకపోతే—30 మంది సభ్యులూ, సహాయనిరాకరణోద్యమునమరాన్ని లేవదీయాలి—ప్రభుత్వం హరిజనాభ్యుదయ కార్యక్రమాన్ని సంతృప్తికరంగా సఫలీకృతం చేయలేకపోతే దానికి బాధ్యులెవరు? "హరిజన శాసనసభ్యులే!!" కదా! అందుచేత స్వజాత్యుద్ధరణకు, దీక్షాకంకణాలు ధరించి, అహోరాత్రాలు కృషిచేయవలసి ఉంది. పదవీవ్యామోహులై—హైందవుల చేతులలో కీలుబొమ్మలై ప్రవర్తించకుండా సాంఘిక విప్లవచైతన్యకాములై—ఒకప్రక్క పీడితజాతీయులికి, మరొకప్రక్క జాతిసదేశానికి సేవజేయ ముందంజవేయాలి. నాడే నిజమైన హరిజనాభ్యుదయం—నాడే గాంధీజీ ఆశయాలకు సాఫల్యత!

—: ముగింపు :—

మానవుడు తనజీవితాన్ని నడిపే శాసనమేదో నిర్ణయించుకోవలసినట్లే ప్రతీ దేశభక్తుడూ తనదేశప్రజానమస్యల్ని పరిష్కరించుకోవలసిన బాధ్యుడై ఉన్నాడు—అందుచేత 'ప్రేమ—కర్తవ్యం' అనే రెండు దివ్యసూత్రాలను శాసనాలుగా భావించి, మానవసేవలో—మాతృదేశసేవలో, ఈశ్వరపితృత్వాన్ని అనుభవించగలిగితే మానవుడు జీవితసమస్యల్నీ, దేశభక్తుడు—రాజకీయసమస్యల్నీ సులభసాధ్యంగా పరిష్కరించుకోగలడు—కనుక అస్పృశ్యుల పరిస్థితులు చరిత్రాత్మకంగా నివేదించి, పతితోద్ధరణకు పూనుకొమ్మని సోదరదేశస్థుల్ని వేడుకున్నాను—ఈరచనలోని ఉద్ఘోష ఆలించి పాలించిననాడే—హరిజనాభ్యుదయంతో—దేశస్వాతంత్ర్యం సిద్ధిస్తుంది. కనుక భావిభారతనిర్మాతల్లారా! మన పవిత్రదేశంలో నాటి గౌతమబుద్ధుడు మొదలుకొని నేటి గాంధీమహాత్ముని వఱకూ గలమహాపురుషులు "అహింస పరమ



ధర్మ" మని ఉపదేశించారు. అది మనం శిరసా వహించి, ప్రాచీన భారతజాతీయ నాగరికతను కాపాడి గౌరవమందాలి—అందుకై సంఘర్షణలు లేకుండా సంఘ సమానత్వాన్ని బలపర్చాలి—లేదా ప్రపంచ చరిత్రలో కానవచ్చే ఆంగ్లజానపదుల తిరుగుబాటు—పరాసు ప్రజావిప్లవం—రష్యాకార్మికుల పోరాటం—మొదలైనవి మనదేశంలో ఉత్పన్నమై ప్రపంచ మానవశాంతికే భంగం కల్గించవచ్చు—అట్టి ప్రళయభీభత్సం మనదేశంలో తటస్థించకుండా కాపాడే మహత్తరశక్తి చైతన్యస్వరూపుడైన పరమేశ్వరుడు మనకు ప్రసాదించుగాక!

# అనుబంధం

## ఆంధ్రలో వివిధనిమ్నజాతుల పేర్లు

1 ఆదిఆంధ్ర. 2 మాదిగ. 3 పాకీ. 4 చచ్చుర. 5 మాలదాసు. 6 బెయిగారి. 7 చలవాది. 8 కొరగాను. 9 బారికి. 10 బావురి. 11 దండాసి. 12 గొడగాలి. 13 గొడారి. 14 హడ్డి. 15 రెల్లి. 16 జగ్గలి. 17 కొడలొ. 18 ఘాసి. 19 మేదర. 20 ముచ్చి. 21 పైడి. 22 పెయిండ. 23 పమిడ. 24 శబరి. 25 మాతంగి.

## ఆంధ్ర హరిజన అసంబ్లీ సభ్యులు

1 శ్రీ సాకేటి గురువులు (శ్రీకాకుళం) 2 శ్రీ బయ్యా సూర్యనారాయణ (కాకినాడ) 3 శ్రీ పండు లక్ష్మణస్వామి (అమలాపురం) 4 శ్రీ గొట్టుముక్కల వెంకన్న (ఏలూరు) 5 శ్రీ వేముల కూర్మయ్య (బందరు) 6 శ్రీ పుట్టా సుబ్బయ్య (వంగవోలు) 7 శ్రీ కమతం షణ్ముఖం (గూడూరు) 8 శ్రీ స్వర్ణ నాగయ్య (కడప) 9 శ్రీ డి. కదిరప్ప (పెనుగొండ)

156860

10 శ్రీ డి. గోవిందదాసు (బళ్లారి) 11 శ్రీ యస్ నాగప్ప (కర్నూలు) 12 శ్రీ యస్. దొరైకణ్ణు (చిత్తూరు)

ఆంధ్రహరిజన కాన్స్టిట్యూయెంటు అసంబ్లీసభ్యులు

1 శ్రీ వేముల చినకేశవరావు. 2 శ్రీ యస్. నాగప్ప.
3 శ్రీ స్వర్ణ నాగయ్య.

ఆంధ్ర హరిజన లా పట్టభద్రులు

1. శ్రీ వేముల కూర్మయ్య (హరిజన మంత్రి) మద్రాసు
2. శ్రీ పి. గోపాలకృష్ణ (ప్రథమహరిజన అడ్వొకేటు) రాజమండ్రి
3. శ్రీ ఓ. వేంకటచలం (లేబరు కన్సీలేషన్ ఆఫీసరు) మద్రాసు
4. శ్రీ టి. వి. రాఘవులు 5. శ్రీ వై. నారాయణమూర్తి
6. శ్రీ యం. అర్జునదాసు

ఆంధ్ర హరిజన గజిటెడ్ ఆఫీసర్లు

1. శ్రీ సప్పా నీలకంఠము (డిప్యూటీసెక్రటరీ, లేబరు డిపార్టుమెంటు-గవర్నమెంటు ఆఫ్ ఇండియా, ఢిల్లీ.)
2. శ్రీ ఓగిరాల వేంకటచలం (లేబరు కన్సీలియేషన్ ఆఫీసరు మద్రాసు.)
3. శ్రీ భూత రాజారావు (ట్రెజరీ డిప్యూటీకలెక్టర్ గుంటూరు)
4. శ్రీ మంగళగిరి అర్జునదాసు (అసిస్టెంటు మేనేజరు ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజి ఆఫీసర్, నెల్లూరు)
5. శ్రీ ? బుల్లెయ్యగారు (డిస్ట్రిక్టు ఎడ్యుకేషనల్ ఆఫీసర్-బందరు)
6. శ్రీ ఒడ్డు రామారావు (డిస్ట్రిక్టు అగ్రికల్చరల్ ఆఫీసరు Viz.
7. శ్రీ బొంతు వేంకటరెడ్డి (సూపరెంటెండెంటు ఆఫ్ లెదరు ఇన్స్టిట్యూటు, మద్రాసు)
8. శ్రీ ప్రత్తిపాటి సుబ్రహ్మణ్యం (జిల్లాబోర్డు ఇంజనీరు-గుంటూరు)
9. శ్రీ పంతగడ భైరవమూర్తి (అసిస్టెంటు ఇంజనీరు-గంజాం)

---

# జాతీయ గ్రంథములు

| | |
|---|---|
| మహాత్మా గాంధి | రు. 0 80 |
| అజాద్ హిందుఫౌజు | 1 00 |
| జాతీయనాయకులు (ప్రథమసంపుటము) | 1 00 |
| జాతీయనాయకులు (ద్వితీయసంపుటము) | 1 00 |
| జవహర్‌లాల్ – ఇందిరకు లేఖలు | 1 00 |
| నేతాజీ సుభాస్‌చంద్రబోస్ | 0 80 |
| జయప్రకాశ నారాయణ | 0 80 |
| చిత్తరంజనదాసు | 0 80 |
| కీ॥ శే॥ బూలాభాయి దేశాయి | 0 80 |
| పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ | 0 80 |
| కస్తూరిబా గాంధి | 0 80 |
| శ్రీ రాజగోపాలాచారి | 0 80 |
| సర్దార్ వల్లభాయిపటేలు | 0 80 |
| శ్రీమతి అరుణఆసఫాలీ | 0 80 |
| జైహింద్ | 0 80 |
| సర్దార్ పృథ్వీసింగ్ | 0 80 |
| అచ్యుత పట్వర్ధన్ | 0 80 |
| జనాబ్ జిన్నా | 0 80 |
| మౌలానా అజాద్ | 0 80 |
| రాజేంద్ర ప్రసాదు | 0 80 |
| రవీంద్రనాథటాగూరు | 0 80 |
| శ్రీ ప్రకాశం | 0 80 |
| డాక్టర్ పట్టాభి | 0 80 |
| మదనమోహన మాలవ్యా | 0 80 |
| ఆచార్య కృపలానీ | 0 80 |
| శ్రీమతి విజయలక్ష్మీపండిట్ | 0 80 |
| ఖాన్ సోదరులు | 0 80 |

రౌతు బుక్కు డిపో, పబ్లిషర్సు అండ్ బుక్సెల్లర్సు, రాజమండ్రి.

TITLE PRINTED - GOUTAMI PRESS, RAJAHMUNDRY - 29-8-47 - 2000